ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం 17 ఆగస్టు 2017 | 16 పేజీలు

వారధిపై ఎందుకీ అజాగ్రత్త?


రెండో నంబరు పిల్లరును కూల్చివేస్తున్న దృశ్యం

తీవ్ర చర్చనీయాంశమైన పిల్లర్ కూల్చివేత ఘటన

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం గోదావరిపై పూర్వం ఎలాంటి వంతెన లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉండేది. పుణ్యక్షేత్రానికి వచ్చేవారు రోజుల తరబడి ప్రయాణం చేయాల్సి వచ్చేది. బూర్గంపాడు మండలం గొమ్మూరు నుంచి పడవ దాటి భద్రాచలం రావాల్సి వచ్చేది. ఈ క్రమంతో 1953లో పడవల ప్రమాదం జరగడంతో సుమారు 300 మంది చనిపోయారు. ఆ సమయంలో పార్లమెంట్‌లో పెద్ద చర్చ జరిగి 1959 డిసెంబరులో అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి భద్రాచలంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1965లో మిగతా 2లో

చె(కొ)త్త సమస్య

పురపాలకాలు కొనుగోలు చేయనున్న వాహనాలు ఇలా ఉండనున్నాయి..



పురపాలకాల్లో చెత్త సేకరణకు 'స్వచ్ఛ ఆటో టిప్పర్స్- డ్రైవర్స్ కం ఓనర్' పథకం

పురవాసుల నుంచి నెలనెలా రూ.40 వసూలు

ఆచరణలో ఇబ్బందులు తప్పేలా లేవు

పాల్వంచ (వార్డులు: 24)	17285	20
కొత్తగూడెం (వార్డులు: 33)	18963	30
ఇల్లెందు (వార్డులు: 24)	5600	08
మణుగూరు (వార్డులు: 23)	8000	12
సత్తుపల్లి (వార్డులు: 24)	7206	10
మధిర (వార్డులు: 24)	8900	09
ఖమ్మం (వార్డులు: 24)	61145	90

నివాసాలు
కొనుగోలు వాహనాలు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే

పురపాలకాలు పారిశుద్ధ్య బాధ్యతల నుంచి క్రమేణా తప్పుకొనే ప్రయత్నం చేస్తున్నాయి. నిర్వహణా భారాన్ని సాకుగా చూపి ఈ విధులను వదిలించుకునేలా చూస్తున్నారు. మరోపక్క తక్కువ ఆదాయం కలిగిన పురపాలకాలకు పట్టణాల్లో పారిశుద్ధ్య పర్యవేక్షణ తలకు మించిన భారంలా మారింది. ఇంటింటా చెత్త సేకరించి డంపు యార్డులకు తరలించడంలో లక్ష్యాలను చేరుకోలేకపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి, వారికే పురవాసుల నుంచి డబ్బులు వసూలు చేసుకునే బాధ్యతలు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'స్వచ్ఛ ఆటో టిప్పర్స్- డ్రైవర్స్ కం ఓనర్' అనే పథకాన్ని తెరపైకి తెస్తోంది. ఈ విధానం ఇప్పటివరకు కేవలం హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీకి మాత్రమే పరిమితమైంది. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా పురపాలకాలకు, నగరపంచాయతీల్లో అమలుకు కార్యాచరణను సిద్ధం చేస్తోంది. నూతన పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని నాలుగు పురపాలకాలు, రెండు నగర పంచాయతీలు, ఒక నగరపాలకంలో చెత్త వాహనాల కొనుగోలుకు అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో ఇంటి నుంచి చెత్తను సేకరించినందుకు గాను నెలకు రూ.40 ఇవ్వాల్సి ఉంటుంది. ఉభయ జిల్లాల పరిస్థితులను అర్థం చేసుకున్నప్పుడు ఆచరణలో ఈ ప్రయత్నం ఇబ్బందులకు దారి తీసేలా కనిపిస్తోంది. మొత్తానికి ఇది పుర వాసులపై భారం మోపటమేన్న విమర్శలూ ఉన్నాయి.

స్వచ్ఛ ఆటో టిప్పర్స్- డ్రైవర్స్ కం ఓనర్ పేరిట వార్డుల్లో ఇంటింటికి తిరిగి సొంత వాహనంతో చెత్తను సేకరించే బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. ఈ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 72పురపాలకాల్లో త్వరలో అమలు చేయాలని నిర్ణయించారు. వాహనాలను ఆయా పురపాలకాల్లోని సాధారణ నిధులు, బ్యాంకు రుణాలతో కొనుగోలు చేయాల్సి ఉంది. పురపాలక కమిషనర్లు ఈ పథకాన్ని అమలుకు త్వరలోనే ప్రకటన చేయనున్నారు. ఇందులో ఉపయోగించే ఆటోలను స్వచ్ఛ ఆటో టిప్పర్స్ అంటారు. వాహనాలన్నీ ఒకే రంగులో, ఒకే రూపంలో ఉంటాయి. వాహనం ధరలో ఎస్సీ, ఎస్టీలు 10శాతం, ఇతరులు 20శాతం వాటా ధనం చెల్లించాలి. మిగిలిన మొత్తం పురపాలకాల హామీతో బ్యాంకుల నుంచి రుణంగా పొందాలి. సులభంగా చెప్పాలంటే పురపాలకాలు, బ్యాంకు, లబ్ధిదారుల మధ్య త్రైపాక్షిక ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. 650 నుంచి 750 గృహాలకు ఒకటి చొప్పున వాహనాన్ని కొనుగోలు చేస్తారు.

ఎవరికి ప్రాధాన్యం?.. ఇప్పటికే చెత్త వాహనాల ద్వారా చెత్తను సేకరించే వారికి ముందుగా ప్రాధాన్యం ఇస్తారు. లైసెన్సు తప్పనిసరిగా ఉండాలి. 21 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వారికే అవకాశం. ఇందులో ఎంపికైన వారు ఒకవేళ గుత్తేదారుల కింద విధులు మిగతా 2లో

50 / 100

సత్ఫలితాలనిచ్చిన కొన్ని చర్యలు

మరికొన్ని నిర్ణయాలతో భక్తులకు మనోభావాలకు దెబ్బ

రేపటికి భద్రాద్రి ఈవో వంద రోజుల పాలన

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం రామాలయం ఈవోగా ప్రభాకర శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టి దాదాపు వంద రోజులు కావస్తోంది. మే 11న ఆయన బాధ్యతలు చేపట్టగా రేపటికి వంద రోజులు పూర్తి చేసుకుంటున్నారు. మూడు నెలలు పూర్తి చేసుకుని నాలుగో నెల పాలన సాగిస్తున్నా ఇంకా బాలారిష్టాలు పట్టిపీడిస్తునే ఉన్నాయి. ఈయన తీసుకున్న కొన్ని ఏకపక్ష నిర్ణయాలను భక్తులను ఇబ్బందిపెట్టగా ఇంకొన్ని నిర్ణయాలు ఆధ్యాత్మికంగా అందర్నీ మెప్పించాయి. భద్రాచలం రామాలయం తరఫున పర్ణశాల ఆలయం వరకు సొంతంగా బస్సులను నడిపించాలని ముందుగా అనుకున్నా ఇది లాభం కన్నా నష్టాలనే మిగుల్చుతుందన్న అంశాన్ని పరిగణలోకి తీసుకుని ఆర్టీసీ సేవలను స్వీకరించారు. ఆర్టీసీ తరఫున బస్సులను నడపడంతో భక్తులను పుణ్యక్షేత్రాలకు చేర్చే లక్ష్యాలను నెరవేర్చుకున్నప్పటికీ ఈ విషయంలో ఎలాంటి నష్టం లేకుండా జాగ్రత్తలు పాటించారు. గత ఈవో రమేశ్‌బాబు ఉన్నప్పుడే బంగారు కవచాలను రాములవారికి దాతలు బహూకరించినప్పటికీ ప్రస్తుత ఈవో చూపించిన చొరవతో ప్రతీ శుక్రవారం బంగారు కవచాలంకృతంలో స్వామివారి దర్శనం ఘనంగా జరుగుతోంది. అద్దాల మండపాన్ని దర్శనం చేసుకునే వెసులుబాటు కల్పించారు. వైదిక కమిటీ సూచనలతో త్వరలో ఇంకొన్ని ఉత్సవాలను కూడా ప్రవేశపెట్టనున్నారు.

మొక్కులకు దిక్కేది రామా..!

భద్రాచలం రామాలయంలో వధూవరులకు పెళ్లి జరిపిస్తే శుభం కలుగుతుందన్నది మిగతా 2లో



న్యూడెమోక్రసీ వర్గాల ఆధిపత్య పోరులో ఒకరు దారుణ హత్యకు గురయ్యారు. సీపీఐ ఎం.ఎల్. ఎన్డీ(చంద్రన్న వర్గం) దళ సభ్యులు, రాయల వర్గ సానుభూతిపరున్ని బుధవారం గ్రామస్థులందరూ చూస్తుండగానే కొట్టి చంపేశారు. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో సుమారు 20 మంది దళ సభ్యులు తుపాకులతో వచ్చి అందరి సమక్షంలో కర్రలతో చితకబాది చంపేశారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

కొట్టి చంపారు

రాయల భాస్కర్ దారుణ హత్య

ఎన్డీ వర్గాల ఆధిపత్య పోరులో ఒకరి హతం

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: పాల్వంచ మండలం పాండురంగాపురం పంచాయతీ నర్సంపేట గ్రామానికి చెందిన రాయల భాస్కర్(55) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. తెలుగుదేశం పార్టీలో ఈయన క్రియాశీలక కార్యకర్త. ఇతని వ్యవసాయ భూములు రాజీవ్‌నగర్ గొత్తికోయ కాలనీ సమీపంలో ఉన్నాయి. ఆయన గతంలో ఎన్డీ చంద్రన్న వర్గానికి సానుభూతిపరునిగా ఉండేవాడు. ఇటీవల రాయల వర్గ సానుభూతిపరునిగా మారాడు. ఈ నేపథ్యంలో చంద్రన్న వర్గానికి చెందిన దళ కమాండర్ రవి సారథ్యంలో 20మంది సభ్యులు బుధవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో నర్సంపేటలో భాస్కర్ ఇంటికి వచ్చారు. టీవీ చూస్తున్న అతను దళ సభ్యుల్ని చూసి పరుగు లంకించుకున్నాడు. వారు అతన్ని వెంబడించి జామాయిల్ తోట సమీపంలో మిగతా 2వ పేజీలో


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చె(కొ)త్త సమస్య

(మొదటిపేజీ తరువాయి) నిర్వహిస్తున్నట్లయితే వారు ప్రస్తుతం చేస్తున్న ఉపాధిని కోల్పోతారు. నిబంధనల ప్రకారం ఇంటింటి నుంచి చెత్తను సేకరించి, సేవా రుసుము(సర్వీస్ ట్యాక్స్) ద్వారా ఆదాయాన్ని పొందాల్సి ఉంటుంది. బ్యాంకు రుణం నెల వారీగా చెల్లించాలి. చెత్తను ఇంధనంగా మార్చే క్రమంలో లభించే ఆదాయంలోనూ వీరికి కొంత వాటా ఉంటుంది. ముందుకు వచ్చేవారి నుంచి దరఖాస్తులను స్వీకరించి అర్హుల ఎంపిక చేయాల్సిన బాధ్యత పుర యంత్రాంగానిదే.

ప్రత్యేక కమిటీ సమక్షంలో...

ఈ పథకంలో లబ్ధిదారుల ఎంపిక కోసం మున్సిపల్ మేయర్, ఛైర్మన్ కమిటీ అధ్యక్షులుగా ఉంటారు. కమిషనర్ మెంబర్ కన్వీనర్గా, మెప్మా, ఇంజినీరింగ్ విభాగం, పారిశుద్ధ్య అధికారి, బ్యాంకు మేనేజర్లు, ప్రత్యేక నియమిత ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. వీరి పర్యవేక్షణలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. తర్వాతనే ఆటోలను పంపిణీ చేస్తారు. ప్రస్తుతం కొత్తగూడెం, పాల్వంచ, ఖమ్మం, సత్తుపల్లి, ఇల్లెందు, మణుగూరు, మధిరల్లో వాహనాల కొరత అధికంగా ఉంది. లబ్ధిదారులు బ్యాంకు రుణాన్ని 60 సమాన నెలసరి వాయిదాల్లో చెల్లించే అవకాశం ఉంటుంది. నిబంధనలను పాటించని పక్షంలో పథకాన్ని మరొకరికి వర్తింపజేసే అధికారం సంబంధిత పుర పాలకాలకు ఉంటుంది.

ఇబ్బందులు తప్పవా?

ప్రస్తుతం పురపాలకాల్లో గుత్తేదారులు, మెప్మా కింద పనిచేస్తున్న కార్మికులే ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తున్నారు. ఇలా సేకరించే సమయంలో అనధికారికంగా రూ.10-20 వసూలు చేస్తున్నారు. ఈ డబ్బులు కొందరు ఇస్తుండగా మరికొందరు ఎందుకు ఇవ్వాలని పారిశుద్ధ్య సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. నూతన కార్యక్రమంలో భాగంగా విధిగా నెలనెలా రూ.40 చెల్లించాల్సి ఉంటుంది. ఈ విషయంలో స్థానికులు ఈ మొత్తాలను చెల్లించటానికి నిరాకరిస్తే ఇబ్బందులు తలెత్తే ప్రమాదముంది. తమ పరిధిలోని వ్యాన్ ఓనర్ చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే డబ్బులు వసూలు సమయంలో వివాదాలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇలాంటిచోట స్థానికులు, సదరు నిర్వాహకుల మధ్య సయోధ్య ఉండేనా? నెలనెలా డబ్బులు చెల్లిస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మిగులుతోంది. సరిగా డబ్బులు వసూలు కాని ప్రాంతాల పారిశుద్ధ్య విషయంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే కొత్త ఇబ్బందులు తప్పవు. సంబంధిత వాహన నిర్వాహకునిదే బాధ్యత అయినా ఆచరణలో పర్యవేక్షణ లోపిస్తే సమస్యాత్మక ప్రాంతాల్లో అందుకే ఖమ్మం లాంటి నగరాల్లో మొదట వాణిజ్య సముదాయాలున్న చోట ఈ వాహనాలను ఉంచాలని అధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం కొత్త విధానంలో 650 నుంచి 750 ఇళ్ల నుంచి చెత్త సేకరణ వీలుపడని అంశం. ఇన్ని ఇళ్ల నుంచి ప్రతిరోజు చెత్త సేకరించటం సాధ్యంకాదు. అధికారులు మాత్రం ఒక్కో ఇంటికి రూ.40 చొప్పున ఆయా ఇళ్ల నుంచి నెలకు రూ.26వేలు ఆదాయం వేతనంగా లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పథకం విషయమై అందరు కమిషనర్లు, ప్రస్తుత గుత్తేదారులు కింద పనిచేస్తున్న కార్మికుల్లో అవగాహన కల్పించే పనిలో నిమగ్నమయ్యారు. మంచి అవకాశాన్ని వినియోగించుకోమని చెబుతున్నారు. ఎంపికయిన లబ్ధిదారులు వేతనంగా లభించే ఆదాయంలో రోజు వారి డీజిల్ ఖర్చు, వాహనం మరమ్మతులు, నెలసరి వాయిదాలను భరించాల్సి ఉంటుంది. ఇన్ని ఖర్చులుపోను ఏం మిగులుతుందనేది ప్రశ్న. పనితీరు సంతృప్తికరంగా లేకుంటే వాహనాన్ని జప్తు చేసుకునే అధికారం అధికారులకు ఉంటుంది. ఈ నేపథ్యంలో పథకం అమలు ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

తెరపై ఈనాడు

దుర్గా: ఫిదా పరమేశ్వరీ: లై
పూర్ణ: జయ జానకి నాయక
విశ్వరూప: నక్షత్రం
మహేశ్వరీ: నేనే రాజు నేనే మంత్రి

పాల్వంచలో..

వెంకటేశ్వర: జయ జానకి నాయక
వేణుగోపాల్: నేనే రాజు నేనే మంత్రి
శాంతి: లై

బ్రాయిలర్ ధరలు

వెన్‌కాబ్ (కిలో కి రూ.లలో)

బ్రాయిలర్ ఫారం ధర	78
రిటైల్ ధర	92
చికెన్ విత్ స్కిన్	129
చికెన్ స్కిన్‌లెస్	152

భద్రాద్రి రామాలయం వేళలు

ఉదయం 4.30 గంటలకు ఆలయం తలుపులు తెరిచి సుప్రభాతం నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆరాధన, సేవాకాలం, నివేదన ఉంటుంది. 7 గంటల నుంచి దర్శనాలు ఉంటాయి. ఉదయం 9 గంటలకు నిత్య కల్యాణం ప్రారంభం. మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు తలుపులు మూస్తారు. రాత్రి 9 గంటల వరకు దర్శనాలు ఉంటాయని ఈవో ప్రభాకర శ్రీనివాస్ తెలిపారు.

అభిషేకాలు

ప్రతీరోజు(ఆదివారం మినహా) భద్రుడి మండపంలో స్వామివారి పాదాలకు అభిషేకం ఉంటుంది. ఇది ఉదయం 7 నుంచి 8.30 వరకు జరుగుతుంది. టిక్కెట్ ధర రూ.100. ప్రతీ ఆదివారం మూలవరులకు అభిషేకం జరుగుతుంది. టిక్కెట్ ధర రూ.1100. ప్రతీ శుక్రవారం లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో ఉదయం 8.30 నుంచి 9 వరకు అభిషేకం ఉంటుంది. టిక్కెట్ ధర రూ.100. ప్రతీ మంగళవారం ఆంజనేయస్వామి వారికి అభిషేకం ఉంటుంది. ప్రతీ శనివారం నరసింహస్వామివారి ఆలయంలో ఉదయం 9 నుంచి 10 వరకు అభిషేకం ఉంటుంది. టిక్కెట్ ధర రూ.100.

శాశ్వత సేవలు(పదేళ్లకు పరిమితం)

శ్రీరామ నవమి మినహా దాత కోరిన రోజు స్వామివారి కల్యాణం చేపించవచ్చు. ఇలా ఏడాదికి ఒక రోజు అవకాశం ఉంటుంది. ఇందుకు రూ.10 వేలు చెల్లించాలి. నలుగురికి అన్నదానం చేయదలిస్తే రూ.1116 చెల్లించాలి. శాశ్వత పట్టాభిషేకం చేయించదలిస్తే ఏడాదిలో ఒకసారి పుష్యమి నక్షత్రం రోజున ఈ అవకాశం వర్తిస్తుంది. ఇందుకు రూ.2500 చెల్లించాలి. శాశ్వత వాహన సేవకు రూ.10 వేలు చెల్లించాలి.

భద్రాచలం, న్యూస్‌టుడే

కొట్టి చంపారు

(మొదటిపేజీ తరువాయి) పట్టుకొని చితకబాదారు.

నీరు తాగిస్తే చంపేస్తాం..

జామాయిల్ తోట సమీపంలో అర్ధగంట పాటు కొట్టిన తరువాత భాస్కర్‌ను నడిపించుకుంటూ గ్రామానికి తీసుకొచ్చారు. గ్రామం నడిబొడ్డులో నిలబెట్టి గ్రామస్థుల్ని అందర్ని పిలిచి వారు చూస్తుండగానే చితకబాదారు. ఎందుకు కొడుతున్నారంటూ కొందరు గ్రామస్థులు అడ్డుకోబోతే తుపాకులు చూపించి భయపెట్టారు. ఇద్దరు అడ్డుకోబోతే వారిపై తుపాకీ మడిమతో దాడి చేశారు. క్షతగాత్రుడి భార్య అడ్డురావడంతో దళంలోని మహిళ సభ్యులు తుపాకులను ఎక్కుపెట్టారు. దీంతో గ్రామస్థులంతా భయభ్రాంతులకు గురయ్యారు. చూస్తుండటం తప్ప ఎవరూ ఏం చేయలేకపోయారు. దాడి సమయంలో దళ సభ్యులు చేవాణిలు లాక్కొని వాటిని పక్కన పడేశారు. తాము వెళ్లిపోయాక 'క్షతగాత్రునికి ఎవరైనా నీరు పోస్తే చంపేస్తామ'ని బెదిరించారు. అప్పటికే తీవ్రంగా గాయపడ్డ భాస్కర్ దళ సభ్యులు వెళ్లిన అయిదు నిమిషాలకే చనిపోయాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్సై సత్యనారాయణ సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. మృతదేహాన్ని ట్రాక్టర్‌లో పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరకు తీసుకొచ్చారు. మృతదేహాన్ని ఎస్పీ అంబర్ కిశోర్ ఝా సందర్శించారు. సాక్షుల్ని విచారించారు. గ్రామస్థులతో మాట్లాడారు.

ఇదీ కారణం..

రాయల భాస్కర్‌తో నాలుగు నెలల క్రితం చంద్రన్న వర్గానికి చెందిన బుద్ధ, ఐత తదితర గిరిజనులు ఘర్షణపడ్డారు. భాస్కర్‌కు చెందిన ట్రాక్టర్, డోజర్ కూలీధరను తగ్గించాలని వారు అడిగారు. దీనికి ససేమిరా అనడంతో వేరే ట్రాక్టర్లను పిలిపించుకుంటామన్నారు. 'మీరెలా వేరే వాహనాలను ఎలా పిలిపించుకుంటారు? నేనే దున్నాల'ని చంద్రన్న వర్గీయులతో భాస్కర్ వాగ్వాదానికి దిగాడు. అంతేకాకుండా రాయల వర్గానికి చెందిన ఆజాద్, ప్రసాద్ అజ్ఞాత దళాలను పిలిపించి బుద్దా, ఐతా తదితర ఏడెనిమిది మందిని కొట్టించాడు. దీని దృష్టిలో పెట్టుకున్న బాధితులు(దెబ్బలు తిన్నవారు) చంద్రన్న దళానికి సమాచారం అందించారు. బుధవారం చంద్రన్న దళం దాడిలో భాస్కర్ ప్రాణాలు కోల్పోయాడు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

50 / 100

(మొదటిపేజీ తరువాయి) భక్తుల నమ్మకం. నిరుపేదల నుంచి ధనవంతుల వరకు ఇలాంటి భావనతో ఉంటారు. తొలినాళ్లలో ఇలాంటి వివాహాలకు అధికారిక హోదా ఉండేది. కాలక్రమంగా అధికారికం లేనప్పటికీ ఆలయం వద్ద తమ పిల్లలకు పెళ్లి జరిగితే చాలు అన్నది పెద్దవాళ్ల భావనగా మారింది. ఇలాంటి భక్తుల మనోభావాలను పరిరక్షించాల్సిన అధికారులు భద్రతా కారణాలరీత్యా ఆలయం వద్ద వివాహాలను నిలిపేయడం వివాదంగా మారింది. నెల్లూరుకు చెందిన భక్తులు మొక్కుల్లో భాగంగా బంధువర్గంతో బుధవారం ఇక్కడకు వచ్చి ఒక జంటకు పెళ్లి జరిపించాలకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెళ్లి జరిపించడానికి వీల్లేదని అధికారులు తెగేసి చెప్పడంతో సమీపంలోని కోదండ రామాలయంలో ఆ జంటకు పెళ్లి జరిపించాల్సి వచ్చింది. ఒకవేళ ఆలయ కార్యాలయం నిర్వహిస్తున్న తానీషా కల్యాణ మండపం పైభాగంలో పెళ్లి జరిపించుకోవచ్చని అంటున్నారు. ఆలయానికి దూరంగా ఉన్న తానీషా మండపంలో పెళ్లి చేసుకోవడానికైతే ఇంత దూరం ఎందుకు వస్తారన్నది అధికారులు విస్మరించారు. సంప్రదాయ వస్త్రాలతో వచ్చిన వారు మాత్రమే ప్రత్యేక పూజలకు అర్హులనే పద్ధతి ఆధ్యాత్మిక భావాలు ఉన్న వారు అభినందిస్తున్నారు. ప్యాంట్ చొక్కాతో వచ్చే వారు అప్పటికప్పుడు పంచె కండువా కొనాలంటే గుత్తేదారును ఆశ్రయించాల్సిందే. వీటికి ధరల నిర్ణయం ఆలయం పరిధిలో లేకపోవడంతో పేద భక్తులు కేవలం దర్శనాలతో వెనుదిరిగి పోవాల్సి వస్తోంది. కొన్ని టెండర్ల గడువు పూర్తయినా కొనసాగించడం కూడా చర్చనీయాంశంగా మారింది.

ప్రసాదాలపై కీలక నిర్ణయం

భద్రాచలం వచ్చిన భక్తులు ఇక్కడి లడ్డూ ప్రసాదాలతో పాటు పులిహోరను కొని తినేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఈ విభాగం నుంచి ప్రతీ నెల రూ. లక్షల్లో నష్టం వస్తుందన్న ఉద్దేశంతో విధుల్లో చేరిన కొద్ది రోజులకే రూ.50 విలువైన 400 గ్రాముల మహా లడ్డూని విక్రయించకుండా ఆపేశారు. నిత్య కల్యాణం జరిపించిన వారికి స్వామివారి ప్రసాదంగా అందించే వాటిలో కల్యాణం లడ్డూ కూడా ఉండాలి. వారికి మాత్రం 400 గ్రాములకు బదులు 300 గ్రాముల లడ్డూని అందిస్తున్నారు. రూ.15కి 100 గ్రాముల లడ్డూని విక్రయిస్తుండగా ఒక్కో లడ్డూపై రూ.1.5 నష్టం వస్తున్నట్లు అంచనా వేసి ఈ పరిమాణాన్ని తగ్గించి 80 గ్రాములు చేశారు. 250 గ్రాముల పులిహోర ధర రూ.10 ఉండగా దీని బరువు 200 గ్రాములకు పరిమితం చేశారు. ఇలా చేయడం వల్ల నెలకు రూ.3.5 లక్షల నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నది ఈవో అభిప్రాయం. బరువు తగ్గడంపై పెద్దగా వ్యతిరేకత రానప్పటికీ కల్యాణ లడ్డూల విక్రయాలను ఆపడం పట్ల భక్తులు నొచ్చుకుంటున్నారు. కల్యాణం జరిపించే భక్తులకు ఉచితంగా అందిస్తున్న లడ్డూలను కౌంటర్లలో విక్రయించేలా చూడగలిగితే కల్యాణం చేపించుకోలేని భక్తులకు వాటిని పొందే భాగ్యం కలుగుతుంది. ప్రస్తుతం లడ్డూలను తయారు చేస్తున్న గుత్తేదారు హక్కులను దేవాదాయ శాఖ అధికారులు అంగీకరించలేదు. ఆ సమయంలో ఒకటే టెండర్ దాఖలు కావడంతో అప్పటి అధికారులు ప్రస్తుత గుత్తేదారుకు హక్కులు కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి టెండర్లను పక్కన పెట్టడంతో మళ్లీ టెండర్లను పిలిచారు. ఈ నెలలో వీటిని తెరవనున్నారు. అనుభవం ఉన్న గుత్తేదారుకే హక్కులు దక్కుతాయన్న నిబంధనతో ఆశావహులకు ఆశాభంగం కలిగిస్తోంది.

భద్రత పేరుతో గందరగోళం

ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఎక్కువగా ఉన్నారనే కారణంతో పాటు సమర్థంగా పని చేయడం లేదన్న సాకుతో 14 మంది సిబ్బందిని తొలగించడం సంచలనమైంది. ఆలయ సిబ్బంది బంధువర్గాన్ని ఉంచి మిగిలిన వారిని ఇంటికి సాగనంపారు. ఇందులో కొంతమందిని కొద్ది రోజుల తర్వాత విధుల్లోకి తీసుకున్నారు. 10మంది సెక్యూరిటీ సిబ్బంది నియామకంలోనూ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. ఎప్పటినుంచో విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డులకన్నా ఇలా కొత్తగా చేర్చుకున్న వారికి ఎక్కువ వేతనం చెల్లించడం గమనార్హం. వీరిని ఇక్కడ చేర్చుకోవడం కోసం ప్రత్యేక వ్యూహరచన చేసినా అది బెడిసికొట్టి రామయ్య ఆదాయానికి భారంగా మారింది. హోంగార్డులను తొలగిస్తున్నట్లు ప్రకటించి వారి స్థానంలో ప్రయివేటు సెక్యూరిటీ గార్డులను నియమించారు. ఈ విషయంలో పోలీస్ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి హోంగార్డులను ఆలయ విధుల్లో తీసుకోవాల్సిందేనని తేల్చిచెప్పడంతో అటు కొత్తగా చేర్చుకున్న సెక్యూరిటీ గార్డులను ఇటు హోంగార్డులను భద్రతా చర్యల్లో ఉండటం వల్ల రాముడి ఆదాయం పెరుగుతుందా? తగ్గుతుందా అన్నది అధికారులకే తెలియాలంటున్నారు భక్తులు. సెల్‌ఫోన్లతో ఆలయ ప్రవేశం నిషేధించడం కొంతవరకు మంచి ఫలితాలనే ఇస్తున్నప్పటికీ ఇక్కడేదో ఇబ్బందికర వాతావరణం ఉన్న సంకేతాలు ఇవ్వడం ఎంతవరకు సబబో ఆలోచించాల్సి ఉంది.

వారధిపై ఎందుకీ అజాగ్రత్త?

(మొదటిపేజీ తరువాయి) రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ దీన్ని ప్రారంభోత్సవం చేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతానికి రవాణా సదుపాయాలు పెరిగాయి. ప్రస్తుతం వాహనాల రాకపోకలు పెరిగాయి. భవిష్యత్తు అవసరాల కోసం మూడేళ్ల కిందట రెండో వంతెనకు కేంద్ర మంత్రి గడ్కరీ, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయగా గుత్తేదారు పోటీపడి లెస్‌కు రూ.65 కోట్లకు హక్కులు దక్కించుకున్నారు. ఈ పనుల్లో భాగంగా ఒక పిల్లర్ ప్రమాణాల ప్రకారం లేకపోవడంతో నేలమట్టమైంది. కూలిందా లేక కూల్చారా? అనేది స్పష్టత లేనప్పటికీ అధికారుల పర్యవేక్షణ లేమి స్పష్టంగా కనిపిస్తుంది. బుధవారం సాయంత్రం సమయంలో ఈ సంఘటన బయటకు పొక్కడంతో సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం సాగింది. ఇటువైపు ప్రయాణం చేసే వారు ఆగి మరీ సెల్‌ఫోన్లలో ఫొటోలను తీసుకుని తమకు తెలిసిన వారికి వాట్సప్ సందేశాలను పంపారు. కొంతమంది రెండో వంతెన కూలింది అనే సందేశాలను కూడా పంపడంతో భద్రాచలంలో ఏదో జరిగిందన్న ప్రచారం క్షణాల్లో అన్ని చోట్లకు చేరుకుంది. ఈ ప్రాంతానికి చెందిన వారు హైదరాబాద్ వంటి చోట్ల స్థిరపడగా స్థానికులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి కనబర్చారు. బ్రిడ్జి పైన ఆగి కింది వైపున ఉన్న రెండో వంతెన ఫొటోలను తీసుకునేందుకు ఎక్కువ మంది ఆగడంతో రద్దీ నెలకొంది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు పాటించారు. ఇప్పటి వరకు ఇలాంటి సంఘటన ఈ ప్రాంతంలో చోటు చేసుకోకపోవడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గోదావరి వరదల కాలంలో రహదారులు కొట్టుకుపోయినప్పటికీ వంతెనలు మాత్రం కూలలేదు. ఇక్కడ మాత్రం పనులు పూర్తి కాకుండానే పిల్లర్‌ను కూల్చడం పట్ల నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. అధికారుల అలసత్వం వల్ల మన్యంలో జరిగిన ఈ సంఘటన పట్ల ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

పోస్టల్ కార్మికుల నిరవధిక సమ్మెకు సీఐటీయూ మద్దతు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా తపాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం నుంచి ప్రారంభమైన నిరవధిక సమ్మెకు సీఐటీయూ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ తెలిపారు. పోస్టాఫీస్ వద్ద కార్మికులు ఏర్పాటు చేసిన నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 3.5లక్షల మంది కార్మికులు పని చేస్తున్న వారికి కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. 10గంటల వరకు విధులు నిర్వర్తిస్తున్న వారికి పనిభద్రత లేకుండా పోతుందన్నారు. మూడు దశాబ్దాలు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన వారికి కనీసం పింఛన్ సౌకర్యం కల్పించకపోవడం అన్యాయమన్నారు. సమస్యల పరిష్కారం కోసం వారు చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం స్పందించాలన్నారు. లేకపోతే వారికి మద్దతుగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి తాటిపర్తి అనిల్, నల్లమల సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు

ఉద్యోగ ప్రకటనల వెల్లువ



కాలం చెల్లిన ఎంప్లాయిమెంట్ కార్డుల పునరుద్ధరణ
2000 సంవత్సరం నుంచి ఉపాధిశాఖలో రెన్యువల్

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే

ఉపాధి అవకాశాలపై మరోసారి ఆశలు పెరుగుతున్నాయి. నిరుద్యోగుల్లో ఉద్యోగాల ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల విడుదలైన ఉద్యోగాల నియామక ప్రకటన నిరుద్యోగుల్లో కొత్త ఊపిరిలూదగా, ఉపాధిశాఖ 2000 సంవత్సరం నుంచి కాలం చెల్లిన ఎంప్లాయిమెంట్ కార్డులను పునరుద్ధరిస్తున్నారు. గతానికి భిన్నంగా ఉపాధిశాఖ కార్పొరేట్ జాబ్‌మేళాలు నిర్వహిస్తోంది. విదేశాల్లో ఉద్యోగాల కోసం టామ్‌కామ్ పేరుతో ప్రత్యేక విభాగం పనిచేస్తోంది. ఇలాంటి తరుణంలో సుదీర్ఘ కాలం నాటి కాలంచెల్లాయి అనుకున్న ఎంప్లాయిమెంట్ కార్డులను పునరుద్ధరించే అవకాశంతో నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చూస్తున్నాయి.

జిల్లాలో 4.8 లక్షల మందికి ఉపయోగం

ఉపాధిశాఖ 2000 సంవత్సరం నుంచి నమోదై రెన్యూవల్ చేయకపోవడంతో కాలం చెల్లిన కార్డులు ఉభయ జిల్లాలో 4.8లక్షలు ఉంటాయనే అంచనాలు ఉన్నాయి. వీరందరికీ తమ ఎంప్లాయిమెంట్ కార్డులు రెన్యూవల్ చేయించుకునే అవకాశం దక్కింది. సహజంగా ఇలాంటి వెసులు బాటులు ఉపాధి శాఖ కల్పిస్తున్నప్పటికీ ఇంతటి సుదీర్ఘ కాలంపాటు కాలం చెల్లిన కార్డులను సైతం రెన్యూవల్ చేయడం ఇదే తొలిసారి. ఖమ్మం ఉపాధి కార్యాలయంలో తాజాగా 67 వేల మంది నిరుద్యోగులు నమోదుతో ఉన్నారు. కొత్తగూడెం జిల్లాలో 43 వేల మంది నిరుద్యోగులు నమోదు చేయించుకొని ఉన్నారు. ఉభయ జిల్లాలో లక్షా పదివేల మంది ఉండగా రెండు జిల్లాల్లో ఏటా 13వేల నుంచి 20 వేల వరకు కొత్తవారు నమోదు అవుతున్నారు. ఈ నమోదు ప్రక్రియ 2000 సంవత్సరం లెక్కలు తీసుకుంటే నాడు ఏటా 35 వేల నుంచి 45 వేల వరకు ఉన్నాయి. తర్వాత ఐటీ ఉద్యోగాల సంఖ్య పెరగడం, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలను ఉపాధిశాఖ పరిధి నుంచి తొలగించడంతో నమోదు ప్రక్రియ తగ్గుముఖం పట్టింది. 2000 సంవత్సరంలో అవిభాజ్య ఖమ్మం ఉపాధి కార్యాలయంలో 3.5లక్షల మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. 2005 నుంచి నమోదు చేసుకున్న అభ్యర్థులు తమ కార్డులను రెన్యూవల్ చేయించుకునేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో కాలం చెల్లిన కార్డుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలు స్వంతంగా ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో పాటు ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఉద్యోగాల నియామక విధానం మొదలు కావడంతో నాడు ఉపాధిశాఖ ప్రాభవం కోల్పోయింది. గతేడాది సింగరేణి సంస్థ ఉద్యోగ నియామకాలు చేపట్టిన క్రమంలో ఉపాధిశాఖలో పేరు నమోదు చేయించుకుని ఉండాలనే నిబంధన పెట్టింది. దీంతో ఉపాధి కార్యాలయాల్లో కొత్త కళ వచ్చింది. ఇందుకుతోడు గతేడాది నుంచి ఉపాధి శాఖ ఆధ్వర్యంలో కార్పొరేట్ జాబ్‌మేళాలు నిర్వహించే పద్ధతి మొదలు పెట్టడంతో ఉపాధిశాఖ వైపు వచ్చేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

ప్రభుత్వ కసరత్తు


కొత్త ఉద్యోగ నియామకాల ప్రకటనలు వెలువరించేందుకు ప్రభుత్వ పరంగా కసరత్తు చేస్తోంది. పంచాయతీ రాజ్‌లో 3405, నీటిపారుదలశాఖలో 1053, విద్యుత్తుశాఖలో 12961, స్త్రీ శిశు సంక్షేమశాఖలో 587, పంచాయతీరాజ్‌లో 3528, రోడ్లు భవనాలశాఖలో 1513, ఆర్థికశాఖలో 720, ఉన్నత విద్యాశాఖలో 1678, అటవీశాఖలో 2033, వ్యవసాయశాఖలో 1418, సింగరేణిలో 1970, వైద్యరోగ్యశాఖలో 8347, విద్యాశాఖలో 12,005, రెవెన్యూలో 2506, పోలీసుశాఖలో 27,440 ఉద్యోగాల భర్తీ నిమిత్తం ప్రకటన విడుదల కానున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఉభయ జిల్లాల్లో నాలుగు లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారనే అంచనాలు ఉన్నాయి. ఇందులో లక్షా పదివేల మంది నిరుద్యోగులు ఉపాధికార్యాలయాల్లో నమోదై ఉన్నారు. ఉద్యోగ ప్రకటనలు ఆశలు రేపుతున్న తరుణంలోనే ఉపాధిశాఖ పనితీరులో మార్పులు చోటుచేసుకోవడంతో నిరుద్యోగులు కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

ఉభయ జిల్లాల్లో కాలం చెల్లినవి: 4.8 లక్షల కార్డులు

ప్రస్తుతం నమోదు చేసుకున్న నిరుద్యోగులు.. **ఖమ్మం జిల్లాలో: 67 వేలు మంది** **భద్రాద్రి కొత్తగూడెం 43 వేల మంది**

నేడు నందమూరి బాలకృష్ణ రాక

ఖమ్మంలో పైసా వసూల్ చిత్రం ఆడియో విడుదల



ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ నటించిన 101వ చిత్రం పైసా వసూల్ చలన చిత్ర ఆడియో విడుదలకు శ్రేయాస్‌మీడియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు హీరో బాలకృష్ణతోపాటు నటిమణి శ్రియ, దర్శక, నిర్మాతలు పూరిజగన్నాథ్, వెనిగండ్ల ఆనంద్‌ప్రసాద్, ఇతర నటులు హాజరు కానున్నారు. ఏర్పాట్లను సీపీ తఫ్సీర్ ఇక్బాల్, శ్రేయాస్‌మీడియా జిల్లా ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసరావులు పరిశీలించారు.

నగరంలో అభిమానుల ప్రదర్శన

పైసావసూల్ చిత్రం ఆడియో విడుదలను పురస్కరించుకుని నందమూరి బాలకృష్ణ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ద్విచక్రవాహన ప్రదర్శన నిర్వహించారు. తొలుత ఎన్‌టీఆర్ కూడలి వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి వైరారోడ్డు, ఓవర్‌బ్రిడ్జి, పీఎస్‌ఆర్‌రోడ్, బోస్ సెంటర్, ఆర్‌వోబి, చర్చికాంపౌండ్ మీదుగా సర్దార్‌పటేల్ స్టేడియం వరకు ద్విచక్రవాహన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్టేడియంలో ఏర్పాట్ల వివరాలు తెలుసుకుంటున్న సీపీ ఇక్బాల్

వైభవంగా సీతారామ కల్యాణోత్సవం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో బుధవారం స్వామివారికి తిరుమంజనం ఘనంగా జరిగింది. ప్రధాన ఆలయంలో స్వామివారికి సుప్రభాతం నిర్వహించి ఆరాధన జరిపి నామార్చనలు చేశారు. క్షేత్ర విశిష్టత అలరించింది. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేనుల వారిని పూజించి పుణ్యాహ వాచనం చేసి కంకణ ధారణ నిర్వహించారు. కన్యాదానం చేసి ప్రవరను పఠించి సీతమ్మకు యోక్త్రధారణ నిర్వహించారు. రామయ్యకు అత్యంత ఘనంగా యజ్ఞోపవీత ధారణ జరిపారు. మాంగళ్యధారణ మంత్రముగ్ధులను చేయగా తలంబ్రాల వేడుక తన్మయులను చేసింది. నిత్య కల్యాణ ఘట్టాన్ని వీక్షించిన భక్తులు కట్న కానుకలు సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. చిత్రకూట మండపంలో స్థానాచార్యులు స్థలసాయి నేతృత్వంలో శ్రీమద్భాగవత సప్తాహం వైభవంగా జరిగింది. అర్చకులు భక్తిశ్రద్ధలతో హోమాన్ని జరిపారు. రేపు శ్రావణ శుక్రవారం పూజల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు కోరారు.



భద్రాద్రిలో తితిదే వసతి నిర్మాణ పనులు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం చేయూత అందిస్తుంది. తానీషా కల్యాణ మండపంలో రామాలయం కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. దీని వెనుక వైపున సుమారు ఎకర స్థలం ఉంది. ఇక్కడ తితిదే వసతి గదుల నిర్మాణం చేయదలిచింది. అడ్డుగా ఉన్నాయనే కారణంతో కొన్ని పాత నిర్మాణాలను తొలగించారు. సుమారు రూ.4.5 కోట్లతో వసతి సదుపాయాలను కల్పించనున్నందున క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్నాయి. కొత్త నిర్మాణాలకు వీలుగా మట్టిని తొలగిస్తున్నారు. ఇలా తొలగించిన మట్టిని ట్రాక్టర్ల ద్వారా శిల్పినగర్ కాలనీలోని దేవుడి స్థలంలో డంపింగ్ చేస్తున్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తితిదే ధర్మకర్తల మండలిలో సభ్యులుగా ఉండడంతో నిధుల మంజూరులో కీలక పాత్ర పోషించారు. ఈ పనులు పూర్తయితే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మట్టిని తోలే క్రమంలో తానీషా మండపం నుంచి కోదండరామాలయం వైపున ట్రాక్టర్ ట్రక్కుల నుంచి మట్టి జారి పోయి వీధులన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీనిపై యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. ఇలా మట్టి లేవకుండా రోడ్లను ట్యాంకర్లతో తడపడంగానీ ఎప్పటికప్పుడు మట్టిని తొలగించడం గానీ చేయాల్సి ఉంది.



తానీషా కల్యాణ మండపం వెనుక వైపున వసతి నిర్మాణ పనుల నిమిత్తం ఇలా మట్టిని తొలగిస్తున్నారు

త్వరలో ఖమ్మంలో అమరవీరుల స్ఫూర్తి యాత్ర: కోదండరాం

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: అమర వీరుల స్ఫూర్తియాత్రను త్వరలో ఖమ్మంలో చేపడుతామని తెలంగాణ ఐక్యకార్యాచరణ సమితి ఛైర్మన్ ఆచార్య కోదండరాం ప్రకటించారు. బుధవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ సదస్సుకు హాజరైన ఆయన కార్యక్రమం అనంతరం నగరంలోని తెఐకాస సంఘ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఐకాస సంస్థను లక్ష్యం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. తాము చేపట్టిన అమరవీరుల స్ఫూర్తి యాత్రను ప్రభుత్వం అడ్డుకోవటం ప్రజాస్వామ్య దేశంలో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మంచిది కాదన్నారు. ఇసుక కాంట్రాక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి అంశాలపై ఉన్న శ్రద్ధ ఎన్నికల వాగ్దానాలపై చూపించాలన్నారు. ప్రజల సమస్యల సాధనకు సభలను పెడుదామనుకుంటే ప్రభుత్వం అడుగడుగునా ఆటంకపర్చడమే ధ్యేయంగా అక్రమ అరెస్టులకు పాల్పడుతుందన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ డా.ఎస్.పాపారావు, భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

గట్టయ్య సెంటర్, న్యూస్‌టుడే: అఖిల భారత యువజన సమాఖ్య ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్బూరి మహేష్, సిద్దినేని కర్ణకుమార్ అధ్యక్షతన భక్తరామదాసు కళాక్షేత్రంలో ఉపాధికల్పన ఉద్యోగాల సాధన డిమాండుతో బుధవారం సదస్సు జరిగింది. సదస్సులో తెఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం మాట్లాడారు. ప్రజాప్రతినిధులు ఇసుక, నీటిపారుదల వంటి కాంట్రాక్టులను దక్కించుకొనే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. రెండు పడకల గదులు, దళితులకు భూమి, సమన్యాయం అంటూ కేసీఆర్ చేసిన వాగ్ధానాలు ఏమయ్యాయని మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు, యువకులు ఏకమై కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. ప్రాణాలు పణంగాపెట్టి తెచ్చుకున్న తెలంగాణాలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కరవయ్యాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మారపాక అనీల్ కుమార్ విమర్శించారు. ఈ సదస్సులో రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోటు కళావతి, సీపీఐ జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు, తెఐకాస జిల్లా ఛైర్మన్ డా.శీలం పాపారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, జాగర్లమూడి రంజిత్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు నానబాల రామకృష్ణ, కట్కూరి సతీష్‌రెడ్డి, నాగరాజు, శ్రావణ్ పాల్గొన్నారు.

టోకెన్ సమ్మె విజయవంతం చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించతలపెట్టిన మున్సిపల్ కార్మికుల టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కర్యాదర్శి కె. సూర్యం, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు ఎస్ఏ జలీల్ పిలుపునిచ్చారు. టోకెన్ సమ్మె విజయవంతం కోరుతూ నగరంలోని షాదీఖానాలో బుధవారం కార్మికసంఘాల ఐకాస ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెంచినట్లుగానే రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో, నగరపాలక సంస్థల్లో, నగరపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 14ను అమలు చేయాలని విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసిన విధంగానే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, కాంట్రాక్టు కార్మికుడికి సైతం పర్మినెంట్ ఉద్యోగితో సమానంగా వేతనాలు ఇవ్వాలని తీర్పులో పేర్కొందని గుర్తుచేశారు. అందుకు విరుద్ధంగా ఒకేరకమైన పనులు చేసే కాంట్రాక్టు కార్మికులకు జీహెచ్ఎంసీలో ఒకరకంగా, జిల్లాల్లో మరోరకంగా వేతనాలు చెల్లించడం సబబుకాదన్నారు. సదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సింగు నర్సింహారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి. రామయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎండీ పాషా, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మా విష్ణువర్దన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బీజీ క్లెమెంట్, ఐఎఫ్‌టీయూ నాయకులు సీహెచ్ విప్లవ్‌కుమార్, వివిధ యూనియన్ల నాయకులు లక్ష్మీనారాయణ, పద్మ, వెంకన్న, జయరాజు, రాములు, గురవయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు, యాకూబ్ పాషా, దుర్గమ్మ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్

భద్రాచలం

ఎంప్లాయ్‌మెంట్ కార్డుల పునరుద్ధరణ

భద్రాచలం, న్యూస్‌టుడే: గడువు మీరిన ఎంప్లాయిమెంట్ కార్డులను పునరుద్ధరించుకోవాలని డీటీడీవో రామమూర్తి తెలిపారు. జనవరి 2000 నుంచి మే 2017 వరకు గడువు మీరిన కార్డులకు ఇది వర్తిస్తుందన్నారు. ఆ సమయంలో రెన్యువల్ చేయించలేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటీడీఏలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన గిర్దావర్

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గిర్దావర్‌గా బి.ఆనంద్‌కుమార్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల శాఖాపరమైన బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న గిర్దావర్ సాయిబాబు భద్రాచలం రెవెన్యూ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బి.ఆనంద్‌కుమార్‌ను దుమ్ముగూడెం రెవెన్యూ కార్యాలయంలో గిర్దావర్‌గా నియమించారు. నూతనంగా విధుల్లో చేరిన గిర్దావర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని అన్నారు.

టీకా మందు.. ఆరోగ్యం మెండు

మీజిల్స్, రూబెల్లా కట్టడికి ఒకటే అస్త్రం

నేటి నుంచి యజ్ఞంలో టీకా పంపిణీకి ఏర్పాట్లు

టీకాలు.. పిల్లల ఆరోగ్యానికి సోపానాలు.. సమయం ప్రకారం వాటిని వేయిస్తే వ్యాధుల నుంచి రక్షణ పొందొచ్చు. ఈ విషయంలో సరైన అవగాహన లేకపోవడంతో పలు వైరస్‌ల వ్యాప్తి కారణంగా భావిభారతం అనారోగ్యంలో చిక్కుకుంటోంది. ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు పలు టీకాలను దఫదఫాలుగా అందజేస్తోంది. కొందరు తల్లిదండ్రులకు అవగాహన లేక కొన్ని సందర్భాల్లో సిబ్బంది నిర్లక్ష్యంతోనే పలు ప్రాంతాల్లోని పిల్లలకు వ్యాక్సిన్ అందని పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భావిపౌరుల ఆరోగ్యానికి రక్షగా ఉండేందుకు ప్రభుత్వం నూతనంగా రెండు వ్యాధులకు ఒకటే అస్త్రాన్ని సంధిస్తోంది. ఇన్నాళ్లు ప్రైవేటు ఆసుపత్రులకే పరిమితమైన మీజిల్స్, రూబెల్లా టీకాలను 15 ఏళ్లలోపు బాలలకు ఉచితంగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీకాయజ్ఞం సంసిద్ధమయ్యాయి. ఈనెల 17 తేదీ నుంచి పంపిణీ చేపట్టనున్న ఎంఆర్ మందు, తట్టు, రూబెల్లా లక్షణాలపై 'న్యూస్‌టుడే' కథనం..



వెంకటాపురం, న్యూస్‌టుడే

భావిపౌరుల ఆరోగ్యానికి రక్షగా నిలిచేందుకు వైద్య ఆరోగ్యశాఖ సంసిద్ధమైంది. ప్రతీ విద్యార్థికి ఎంఆర్‌టీకాను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. అందుకు అనుగుణంగా ఇప్పటికే క్షేత్రస్థాయిలో అర్హుల జాబితాను సిద్ధం చేసింది. విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే వైద్య ఆరోగ్యశాఖకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, బడిబయటి పిల్లల వివరాలను నివేదికల్లో నిక్షిప్తం చేసింది. ఈ మేరకు వెంకటాపురం మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో 4551 మంది, అంగన్‌వాడీ కేంద్రాలు, బడిబయట పిల్లల సంఖ్య 2399 ఉన్నట్లు గుర్తించి 981 వైల్స్(ఎంఆర్‌టీకా మందు)ను తెప్పించింది. మండలవ్యాప్తంగా ఉన్న పది ఆరోగ్య ఉప కేంద్రాల పరిధి వారిగా జాబితాను సిద్ధం చేసి ఆ దిశగా వైద్య సిబ్బందిచే పంపిణీ చేసేలా ప్రణాళిక చేశారు. గురువారం నుంచి చేపట్టనున్న పంపిణీ ప్రక్రియను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. టీకా మందును సరఫరా చేసేందుకు వైద్య సిబ్బందికి పలు దఫాల శిక్షణలు సైతం ఇచ్చారు. ఏటా రెండు డోసుల్లో ఈ టీకా ఇచ్చేలా పట్టికలను రూపొందించారు. మొదటి విడతలో అందరికి ఒక డోసు ఇవ్వడం, రెండో విడతలో 16 నుంచి 24 నెలల వయసు కలిగిన వారికి రెండో రోస్ అందించేలా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది.



భావిపౌరులకు అందించనున్న ఎంఆర్ టీకా మందు ఇదే

సమస్యాత్మక పల్లెలపై ప్రత్యేక శ్రద్ధ

గ్రామీణ ప్రాంతాల్లోని మారుమూలగా ఉన్న సమస్యాత్మక పల్లెల్లో టీకా మందు పంపిణీ ప్రక్రియను ప్రత్యేకంగా చేపట్టారు. ఆలుబాక పంచాయతీ పరిధిలోని మారుమూల అడవులకు దగ్గరగా ఉన్న ముత్తారం, సీతారాంపురం, కలిపాక, పెంకవాగు, తిప్పాపురం, తడపల, గుట్టలపై ఉన్న పాముసూరు, ముకునూరు గిరిజన గ్రామాలను ప్రత్యేకంగా తేదీలను కేటాయించారు. అక్కడి పల్లెలను సందర్శించడంతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి టీకా అందించనున్నారు. ఇంటింటికి వెళ్లి గిరిజనంలో చైతన్యం కలిగించేలా ప్రణాళిక చేసినట్లు సమాచారం.

మీజిల్స్ లక్షణాలు..

మీజిల్స్ వ్యాధి లాలాజలం, శ్లేష్మం ద్వారా వ్యాపిస్తుంది. ముఖ్యంగా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌ను కలగజేస్తోంది. అంటే శ్వాసతో పాటుగా వచ్చే తుపర్లలోంచి వైరస్ సోకి తట్టుగా వస్తుంది. కళ్లు ఎర్రబడటం, చర్మంపై దురద రావడం, నోటిలో అతిసూక్ష్మమైన దద్దుర్లు, జ్వరంతో పాటుగా దగ్గు కూడా వస్తుంది. ఒకానొక దశలో తీవ్రమైన అతిసార వ్యాధి సోకి రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోతుంది. తద్వారా చిన్నారుల మరణానికి దారితీస్తోంది.

రూబెల్లా లక్షణాలు..

రూబెల్లా వ్యాధి చిన్నారులతో పాటు 15 ఏళ్ల బాలురుకు కూడా సోకుతుంది. ఈ వైరస్ వల్ల చర్మంపై ఎర్రటి దద్దుర్లు వస్తాయి. జ్వరం, తలనొప్పి, కళ్లు గులాబీ రంగులోకి మారడం, ముక్కు కారడం, గొంతు గరగరలాడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దానివల్ల గుండె జబ్బు, అంగవైకల్యం, కంటి లోపాలు సంభవించడంతో పాటు మరణానికి కూడా చేరువవుతారు. ఇది ఎక్కువగా గర్భస్థ స్థితిలో సోకి పిల్లల్లో వృద్ధి చెందుతుందని వైద్యఆరోగ్యశాఖ పేర్కొంటోంది.

అందరూ పాలు పంచుకోవాలి:

శ్యాంసుందర్, వైద్యాధికారి ఎదిర పీహెచ్‌సీ

భావితరాలకు ఎంతో ఉపయుక్తమైన ఈ టీకా మందును అర్హులకు అందించడంలో అందరూ పాలు పంచుకోవాలి. ఇప్పటికే వ్యాక్సిన్‌లు తెప్పించి సంసిద్ధంగా ఉన్నాం. ఆరోగ్య ఉప కేంద్రం వారిగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు వైద్యసిబ్బందిని అప్రమత్తం చేశాం. ముఖ్యంగా చిన్నారులు, బాలికల ఆరోగ్యానికి టీకా మందు పసందు లాంటింది. బాలికలకు చిన్నప్పుడే టీకాలు వేయించకుండా పెళ్లి చేస్తే వారు తట్టు, రూబెల్లా వ్యాధుల బారిన పడి పుట్టబోయే బిడ్డ వివిధ లోపాలతో జన్మిస్తున్నట్లు తేలింది. ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా 9 నెలల నుంచి 15 సంవత్సరాల బాలలకు ఈ టీకాను వేయించాలి.

కూరగాయల ధరలు (కిలో రూ.ల్లో)

భద్రాచలం: ఉల్లిపాయలు 15, టమాట 60, అల్లం 60, బెండకాయలు 40, దొండకాయలు 30, పచ్చి మిరప 80, బంగాళాదుంపలు 20, వంకాయలు 40, క్యారెట్ 80, క్యాబేజీ 30, మునగకాయ మూడు 10, చింతపండు 100, చేమదుంపలు 40, ఆనప 15, కాకర 40.



భద్రాచలం

ఏషియన్ ఉదయభాస్కర్
ఫిదా
విజయభాస్కర్
నేనే రాజు నేనే మంత్రి
గోపాలకృష్ణ
జయ జానకి నాయక

గురుకులం ట్యాంకు నుంచి వృథాగా నీళ్ల ధార

భద్రాచలం గిరిజన బాలికల గురుకులంలో విద్యార్థినుల అవసరాల నిమిత్తం నిర్మించిన ట్యాంకు నుంచి నీళ్లు ధారగా కారిపోతున్నాయి. ట్యాంకు పైభాగంలో ఏర్పాటు చేసిన పైపు ద్వారా ఇవి కారిపోతునే ఉంటాయి. ట్యాంకు నిండినప్పటికే మోటార్‌ను ఆపేవాళ్లు లేకపోవడంతో ఈ వృథా తప్పడం లేదు. బుధవారం ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్ మనిపించింది.



–భద్రాచలం, న్యూస్‌టుడే

ప్రశాంతంగా మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవి ఎన్నిక

వాజేడు, న్యూస్‌టుడే: వాజేడు మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి బుధవారం జరిగిన ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. వాజేడు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బత్తుల సాయిదేవి రాజీనామాతో ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎన్నికకు ఏడుగురు ఎంపీటీసీ సభ్యులలో ఐదుగురు హాజరయ్యారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వీరభద్రం, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో చేతులెత్తే పద్ధతి ద్వారా ఎన్నికను నిర్వహించారు. నాగారం ఎంపీటీసీ సభ్యురాలు చెన్నం రాంబాయిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ఎన్నికకు హాజరైన ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తడం ద్వారా ఆమోదం తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా నాగారం ఎంపీటీసీ సభ్యురాలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి వీరభద్రం ప్రకటించారు. వాజేడు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన చెన్నంరాం బాయితో సహాయ ప్రిసైడింగ్ అధికారి తహసీల్దార్ రమాదేవి ప్రమాణం చేయించారు. అనంతరం సమావేశ మందిరంలో మండల పరిషత్ పాలకవర్గం, తెరాస మండలశాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షురాలిని సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, ఎంపీపీ గొండిస్వరూప, జిప్రాని సభ్యురాలు సోమిడిద నలక్ష్మి, తెరాస మండలశాఖ అధ్యక్ష, ఉపాధ్యక్షులు విక్రాంత్, రామకృష్ణారెడ్డి, మంప్రాని సభ్యులు పోచాలు, ఇందిర, లలిత, కోఆప్షన్ సభ్యుడు మజీద్, తెరాస నాయకులు ఎల్లయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ముందస్తు సమావేశంలోనే తీర్మానం: మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి బుధవారం ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో ముందుగానే ఎన్నికను ఏకగ్రీవంగా జరిగేందుకు మంప్రాని సభ్యులందరూ సహకరించాలని పార్టీ సమావేశంలోనే తీర్మానించారు. మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవి ఎన్నికలో సభ్యులలో అసంతృప్తి లేకపోయినా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమావేశానికి ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నారు. ఉపాధ్యక్ష పదవి ఎన్నికకు ముందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, తెరాస మండలశాఖ అధ్యక్షుడు విక్రాంత్ పార్టీ అంతర్గత సమావేశంలో మంప్రాని సభ్యులకు సూచనలు చేశారు.



నూతన ఉపాధ్యక్షురాలిని సత్కరిస్తున్న పాలకవర్గం సభ్యులు

ఆదివాసీపై పెట్టిన కేసును తొలగించాలి

వెంకటాపురం, న్యూస్‌టుడే: వివాదంలో ఎలాంటి ప్రమేయం లేని ఆదివాసీ చిడెం కుమారస్వామిపై పోలీసులు కేసు నమోదు చేయడం దారుణమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఉయిక శంకర్, ఏవీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం రామచందర్‌రావు అన్నారు. వెంకటాపురంలోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వీరభద్రవరానికి చెందిన వీఆర్ఏ తొలగింపు వ్యవహారంలో ఇరువర్గాల మధ్య వివాదం జరిగడం, కుమారస్వామి ఇంటికి పలువురు వ్యక్తులు వచ్చి దాడికి పాల్పడితే ఆ విషయంలో సంబంధం లేని ఆదివాసీపై పోలీసులు ఎలా కేసు నమోదు చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై బుధవారం ఏటూరు నాగారం ఏఎస్పీ రాహుల్ హెగ్డేను కలిసి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వివాదంపై పూర్తిస్థాయిలో విచారణ చేయకుండానే దాడికి పాల్పడిన వ్యక్తులను వదిలి అమాయకుడైన ఆదివాసీపై అక్రమ కేసును పెట్టారని ఆరోపించారు. తక్షణమే తప్పుడు కేసును తొలగించి ఆదివాసీకి న్యాయం చేయాలని లేని పక్షంలో న్యాయపరమైన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. సంఘం నాయకులు అట్టం సత్యనారాయణ, ఉయిక గోపి, వెంకటేశ్వర్లు, మునేశ్వరరావు, ప్రసాద్, రాములు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్, ఏవీఎస్పీ నాయకులు

భద్రాచలం

మన్యంలో దళితుల భూములకు రక్షణ కల్పించాలి

వెంకటాపురం, న్యూస్‌టుడే: మన్యంలో దశాబ్ధాల కాలంగా దళితుల సాగులో ఉన్న భూములకు ప్రభుత్వ యంతాంగం రక్షణ కల్పించాలని తెలంగాణ మాదిగ ఐకాస జిల్లా అధ్యక్షుడు యాసం సిద్ధార్థపూలే డిమాండు చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దారు పి.భిక్షంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీలో గిరిజనులతో సమానంగానే ఇక్కడ జీవిస్తున్న దళితులు ప్రభుత్వ, గ్రామకంఠం భూములను ఆధీనంలోకి తీసుకొని కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఆ దళితుల భూములకు నేడు రక్షణ కరవైందని పేర్కొన్నారు. దళితులకు మూడెకరాల సాగుభూమి ఇస్తామంటూ తెలంగాణ ప్రభుత్వం ప్రకటించదని ఆ హామీని నెరవేర్చడంతో పాటు దళితుల ఆధీనంలో ఉన్న భూములను ఇతరులు లాక్కోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నం గోపి, మండల అధ్యక్షుడు వేల్పుల రామ్‌కుమార్, వేల్పుల వెంకటేశ్, యాసం శ్రీను, అడ్డూరి రాములు, చెన్నం వెంకటేశ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ముస్తాబు

ఎదిర(వెంకటాపురం), న్యూస్‌టుడే: ఎదిరలో నూతనంగా నిర్మాణం జరిపిన శ్రీవినాయక సుబ్రహ్మణ్య సహిత అభయాంజనేయస్వామి ఆలయం ప్రారంభానికి ముస్తాబైంది. ఇక్కడ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి పూజ కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పథకాలు చేరువ కావడం లేదు


మాట్లాడుతున్న తెదేపా మండలశాఖ అధ్యక్షుడు దామోదర్‌రావు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: తెరాస ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తి స్థాయిలో అందడం లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. బుధవారం లక్ష్మీనగరం తెదేపా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తూరి సీతారామారావు, మండల శాఖ అధ్యక్షుడు కొమరం దామోదర్ రావు, మండల కార్యదర్శి కెల్లా వేణుగోపాల్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని భూసర్వే చేస్తామని చెబుతోందని ముందుగా ఏజెన్సీలో ఉన్న గిరిజనుల హక్కులను ఎలా కాపాడుతారో తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. రాజ్యాంగంలో ఉన్న చట్టాలకు లోబడి భూసర్వే నిర్వహించాలని, కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల నుంచి అనేక సర్వేల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. అటవీ హక్కుల చట్టం కింద ఇంతవరకు పోడు సాగుదారులకు హక్కు పత్రాలు మంజూరు చేయలేదని, 2008 సంవత్సరం నుంచి పోడు భూములు నరికి వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు హక్కుపత్రాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గత ప్రభుత్వాలు దస్త్రాల క్లియరెన్స్ పేరుతో అనేక 4 భూరికార్డులను అక్రమ మార్గాల్లో మార్చేయడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం గిరిజనులకు ఏజెన్సీ సర్టిఫికెట్లు మంజూరు చేయడానికి రెవెన్యూ అధికారుల నుంచి అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయని అన్నారు. దుమ్ముగూడెం మండల కేంద్రంలో మూడు నెలలు నుంచి పింఛన్లు సకాలంలో పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. రెండు పడక గదుల గృహాల మంజూరు, పింఛన్లు మంజూరు వంటి అనేక ఎన్నికల హామీలు నెరవేరలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో తెదేపా ఎస్‌టి సెల్ మండల కార్యదర్శి పద్మ, సుజాత, సమ్మక్క, ఆకుల అనిల్ పాల్గొన్నారు.


గేటు ధర్నాలో పాల్గొన్న డ్రైవర్లు, కార్మికులు

డిపోలో సమస్యలపై గేటు ధర్నా

భద్రాచలం అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే: భద్రాచలం ఆర్టీసీ డిపోలో ఉన్న సమస్యలపై ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం గేటు ధర్నా నిర్వహించి డిపో మేనేజరు నరసింహకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు డిపో కార్యదర్శి సుందరం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక డిపో సమస్యలపై గేటు ధర్నా నిర్వహస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రైవర్ల, కండక్టర్లకు ఛార్టులు వెంటనే వేయాలని, ఫిట్ తెచ్చిన కార్మికులను వెంటనే డ్యూటీలో జాయిన్ చేసుకోవాలని, గ్యారేజీలో పరికరాల సమస్య పరిష్కరించాలని అన్నారు. డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారని అనంతరం మేనేజరుకు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

ఆదివాసీ గర్జన ర్యాలీని జయప్రదం చేయాలి

వెంకటాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు కోరుతూ ఈనెల 21న నిర్వహించ తలపెట్టిన ఆదివాసీ విద్యార్థుల గర్జన ర్యాలీని జయప్రదం చేయాలని జీఎస్పీ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పూనెం సాయి కోరారు. వెంకటాపురంలోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు కళాశాలలు అందుబాటులో ఉన్న అధిక ఫీజుల కారణంగా గిరిజన విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారన్నారు. ఈ ఆందోళనకు ఆదివాసీ ఉద్యోగులు, యువత, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జాతీయ సేవా పథకం పునశ్చరణ కార్యక్రమం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు పునశ్చరణ కార్యక్రమం జరిగింది. వ్యాసరచన, వక్తృత్వ పోటీలల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్.వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజం పట్ల అవగాహనతో క్రమశిక్షణ కల్గిన పౌరుడిగా ఎదగడానికి, నాయకత్వ లక్షణాలు పెంపొందిచుకునేందుకు జాతీయ సేవా పథకం ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం జాతీయ సేవా పథకంలో నూతనంగా ప్రవేశం పొందిన వలంటీర్లకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, వినయ్, శోభన్, నరేన్, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

ఏకీకృత సర్వీసులో కలపాలి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని లక్ష్మీనగరం ఆశ్రమ పాఠశాల ఆవరణలో బుధవారం సేవాలాల్ ఉద్యోగ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. సేవాలాల్ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.బాలకృష్ణ మాట్లాడుతూ.. గిరిజన ప్రభుత్వ ఉపాధ్యాయులను ఏకీకృత సర్వీసులో కలపాలని 2004 సంవత్సరం తర్వాత నియమించిన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆగస్టు 2013 సంవత్సరంలో ఐటీడీఏలో ప్రత్యేక డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు 2015 పీఆర్సీలో ఇంక్రిమెంట్ నష్టం జరిగిందని వీరందరికీ సత్వరమే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడుగా బాదావత్ రవినాయక్, ప్రధాన కార్యదర్శి లావుడ్యా భాస్కర్, కోశాధికారిగా గుగులోత్ రమేశ్, మండల కార్యదర్శిగా జె.భద్రు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జె.శ్రీను, ఉపాధ్యాయులు నరేష్, మంజుల, నరేందర్, ఉపేందర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

భద్రాచలం రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా గణేశ్

భద్రాచలం అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే: భద్రాచలం రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా బుధవారం కె.గణేశ్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. స్థానిక తహసీల్దారు పి.రామకృష్ణకు ఉత్తర్వుల కాపీని అందజేసి విధుల్లో చేరారు. ఇప్పటి వరకు భద్రాచలంలో ఆర్ఐగా విధులు నిర్వహించిన మోహన్‌రావు కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

18న అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ

చర్ల, న్యూస్‌టుడే: చర్లలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 18న 'అల్లూరి సీతారామరాజు' విగ్రహావిష్కరణ జరగనుంది. సీతారామ ఆయిల్ ట్రేడర్స్ యజమాని ఏరుకొండ హరికిషన్ ఈ విగ్రహాన్ని స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. దాదాపు రూ.50 వేలతో దీన్ని రూపొందించారు. జూనియర్ కళాశాల ప్రాంగణంలో మహాత్ముని విగ్రహం, వనవాసీ విద్యాలయం ఆవరణలో వివేకానందుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

కొర్రాజులగుట్ట(భద్రాచలం పట్టణం), న్యూస్‌టుడే: పట్టణంలోని మరుగుదొడ్లు లేని ప్రతీ ఒక్కరు సహకరించి మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ముందుకు రావాలని గ్రామ పంచాయతీ సర్పంచి భూక్యా శ్వేత అన్నారు. భద్రాచలంలోని కొర్రాజులగుట్ట కాలనీలో బుధవారం నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్ల వినియోగదారులకు సర్పంచి శ్వేత చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బుధవారం కాలనీలోని 20 మందికి చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు మరుగుదొడ్లను నిర్మించుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. నిర్మాణం పూర్తయిన ప్రతీ మరుగుదొడ్డికి ప్రభుత్వం రూ.12 వేలు ఇస్తుందని అన్నారు. బహిరంగ మల విసర్జనను నిర్మాలించి పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, వార్డు సభ్యురాలు మడం లక్ష్మి కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా తల్లీబిడ్డా

చర్ల, న్యూస్‌టుడే: చర్ల మండలం మారుమూల ఎర్రంపాడుకు చెందిన ఆదివాసీ బాలింత మడకం బిందు, ఆమె బాబు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని వైద్యాధికారి మణికంఠారెడ్డి బుధవారం తెలిపారు. కాన్పు కోసం వస్తున్న బింధు అడవిలోనే ప్రసవం కావడంతో హుటాహుటిన 108 ద్వారా సత్యనారాయణపురం ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో బిందుకు ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రిలో ఈమెకు కేసీఆర్ కిట్టును వైద్యాధికారికి అందజేశారు.


బిందుకు పుట్టిన బాబును పరీక్షిస్తున్న వైద్యాధికారి మణికంఠారెడ్డి

పొలాలు ఎండిపోతున్నాయి.. కాపాడండి

భద్రాచలం అంబేడ్కర్ సెంటర్, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరా సక్రమంగా లేక నీరు అందక మా పంట పొలాలు ఎండిపోతున్నాయి.. మమ్మల్ని కాపాడండి అంటూ విద్యుత్తు శాఖ డీఈ ప్రతాపరెడ్డికి బుధవారం పలువురు రైతులు మొరపెట్టుకున్నారు. రాష్ట్రం విడిపోవడంతో సరిహద్దులో ఉన్న తమ పొలాలకు విద్యుత్తు సరఫరా చేసే విద్యుత్తు నియంత్రికల ద్వారా ఆంధ్రాలో నుంచి విద్యుత్తు సరఫరా వస్తుందని అన్నారు. సుమారు 30 మంది మేము మాత్రం బిల్లు తెలంగాణలోనే చెల్లిస్తున్నామని వారు తెలిపారు. మాకు విద్యుత్తు సరఫరా జరిగే క్రమంలో ఆంధ్రా ప్రాంతంలో ఎద్దైనా సాంకేతిక సమస్య తలెత్తితే, సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లినా సుమారు 4, 5 రోజుల వరకు విద్యుత్తు నిలిచిపోయి సరిహద్దు తెలంగాణలో ఉన్న మాకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోయారు. తెలంగాణలో విద్యుత్తు సరఫరా 9 గంటలు కాగా ఆంధ్రాలో 7 గంటలు మాత్రమే సరఫరా అని రైతులు వాపోతున్నారు. దీనిపై ఇటీవల మంత్రి తుమ్మలకు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై వెంటనే స్పందించిన డీఈ ప్రతాపరెడ్డి భద్రాచలంలో స్థానికంగా ఉన్న తహసీల్దారుని విచారణ చేసి తెలంగాణ భూభాగం పరిధి వివరాలు తెలుకుని విద్యుత్తు నియంత్రికల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని, ప్రస్తుతానికి చిన్న చిన్న సమస్యలు ఉంటే సరిచేస్తానని ఏఈని పిలిపించి తగిన సూచనలు చేశారు. రైతులు రామచంద్రరావు, కృష్ణ, పవన్, వరప్రసాద్, న్యాయవాది కొడాలి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.


రైతుల సమస్యలు విని సూచనలు చేస్తున్న డీఈ ప్రతాపరెడ్డి, రైతులు

బీడీసీఆర్‌లో స్వచ్ఛ పక్వాడా

కొత్తగూడెం రామవరం, న్యూస్‌టుడే: రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ పక్వాడాను పురస్కరించుకొని స్టేషన్‌లో, ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. ఏరియా అధికారి మణికుమార్ మాట్లాడుతూ రైల్వేలో పరిశుభ్ర వాతావరణానికి కృషి చేయాలని, మొక్కలు నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించి, ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ కె.శివశంకర్‌గౌడ్, ఎస్ఎస్.నరసింహారావు, అధికారులు శశిభూషణ్, అరుణ్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, ఉద్యోగులు పాల్గొన్నారు.



స్టేషన్‌లో స్వచ్ఛపక్వాడా ప్రదర్శనను నిర్వహిస్తున్న బీడీసీఆర్ ఉద్యోగులు

కొత్త సరకు.. కొనేదిక్కు లేదాయె..

పెసర రైతుకు ఆదిలోనే కష్టాలు

మార్కెట్లో ఇబ్బంది పెడుతున్న వ్యాపారులు

'ఈ-నామ్' పేరుతో గంటల తరబడి జాప్యం

తిరిగి తీసుకెళ్లలేక నరక యాతన

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్న చందంగా ఉంది రైతన్నల పరిస్థితి. ఆరుగాలం కష్టపడి పండించిన సరకును విపణికి తెస్తే కొనేదిక్కు లేదు. ఇప్పుడే చేతికొచ్చిన పంటను రైతు తన అవసరాల కోసం తీసుకురాగా వ్యాపారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం ఎంత ధర పెట్టేది కూడా చెప్పక పోవటంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని అపరాల యార్డుకు సెలవుల తర్వాత పెసలు ఎక్కువగా వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి రైతులు మొత్తం సుమారు 150క్వింటాళ్ల వరకు కొత్త పెసలను తెచ్చారు. కొంత మందికి చెందిన సరకును కొనుగోలు చేసి మిగతా రైతులకు సంబంధించిన వాటిని కొనుగోలు చేయలేదు. కొణిజర్ల మండలం మల్లుపల్లికి చెందిన సుమారు 8మంది రైతులు బుధవారం ఉదయం 6గంటలకే మార్కెట్‌కు తెచ్చారు. అపరాల యార్డులో 'ఈ-నామ్' విధానం అమల్లో ఉంది. ఉదయం 10గంటలకు సరుకు చూసిన వ్యాపారులు ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ నమోదు చేశారు. మధ్యాహ్నం 1గంటకు బిడ్ ఓపెన్ చేసిన తర్వాత చూస్తే వీరిలో కేవలం మేడా


బస్తాల్లోకి పెసలు ఎత్తుకుంటున్న రైతులు

కృష్ణార్జునరావు అనే ఒక రైతుకు సంబంధించిన సరకును మాత్రమే రూ.4500ల చొప్పున కొనుగోలు చేయటానికి ధరను నిర్ణయించారు. మిగతా ఏడుగురు రైతులకు సంబంధించిన సరకును కొనుగోలు చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు. ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ వేయలేదు. దీన్ని చూసి రైతులు ఒక్క సారిగా షాక్ అయ్యారు. కనీసం కొంత ధర తగ్గించైనా బిడ్డింగ్ వేయాలి తప్ప అసలు వేయకుండా ఉండటంతో ఆందోళన చెందారు.

మరో వైపు భారీ వర్షాలు వస్తున్నాయి. ఇక్కడ ఉంచుకొని ఇంటికెళ్లే పరిస్థితి లేదు. విషయం తెలిసిన రైతులు పలువురి దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగం లేకపోవటంతో తిరిగి బస్తాల్లోకి నింపుకొన్నారు. వ్యాపారులు కొనుగోలు చేయకపోవటంతో ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కందులు తెచ్చిన రైతుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. యార్డులో ఈనామ్ విధానం అమల్లో ఉన్నప్పటికీ వ్యాపారులు మార్కెట్‌కు వచ్చిన సరకుకు అసలు ధర నిర్ణయించకుండా ఆన్‌లైన్ బిడ్డింగ్ నమోదు చేయకపోవటం వల్ల రైతులకు ఇబ్బందిగా ఉంది. ఈవిషయంలో అధికారులు, ఉద్యోగులు చెప్పినా వ్యాపారులు వినేపరిస్థితి కన్పించటం లేదు. ఈనామ్ విధానం ద్వారా అధిక ధర వస్తుందని రైతులు ఆశపడితే కనీస ధర కూడా రాకుండా వ్యాపారుల చర్యలు ఉంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా మల్లుపల్లి ఒక్క గ్రామానికి చెందిన రైతులు మాత్రమే సుమారు 35క్వింటాళ్ల సరకు తెచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన వారు కూడా మార్కెట్‌లో ఇలాంటి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

పెసలు ఇంటికి తీసుకెళ్తున్నాం

-బాణోతు కృష్ణ, రైతు, మల్లుపల్లి, కొణిజర్ల మండలం



ఉదయం యార్డుకు వస్తే ఇంత వరకు కూడా పెసలు కొనే దిక్కు లేదు. దీంతో పెసలను తిరిగి ఇంటికి తీసుకెళ్తున్నాం. వ్యాపారులు వచ్చి సరుకు చూసి వెళ్లారు. కొనుగోలు చేయటానికి ధర నిర్ణయించలేదు. గంటల తరబడి పడిగాపులు కాసినా మా మొర ఆలకించే వారు లేరు. రైతుల పరిస్థితి దారుణంగా ఉంది.

చాలా ఇబ్బందిగా ఉంది

-బాణోతు రమేశ్, రైతు, మల్లుపల్లి



కొత్త పెసలు ఎంతో నాణ్యతగా ఉన్నాయి. అయినప్పటికీ వ్యాపారులు కొనుగోలు చేయటానికి అనేక కొర్రీలు పెడుతున్నారు. చాలా ఇబ్బందిగా ఉంది. వర్షం వస్తే ఇక్కడ మా పరిస్థితి ఏంటి. ఉదయం నుంచి మా గోడు చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోవటం లేరు. కష్టపడి పండించినా ధర లేదు.

కందులు కూడా కొనటం లేరు

-బాణోతు మల్సూరు, రైతు, మల్లుపల్లి



పెసలు కొనే దిక్కులేక తమ గ్రామ రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. నేను కందులు తెచ్చినా వాటిని కూడా కొనటానికి వ్యాపారులు ముందుకు రావటం లేరు. ఉదయం నుంచి తిండీ తిప్పలు లేక ఇబ్బంది పడుతుంటే వ్యాపారులు కనీసం కనికరించటం లేరు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

రైతుల పరిస్థితి దారుణం

-బాణోతు నాగేశ్వరరావు, రైతు, మల్లుపల్లి



పండించిన పంటను గ్రామాల్లో మధ్య దళారీలకు అమ్ముకోలేక ఇక్కడకు వస్తే ఇక్కడ వ్యాపారులు ఇబ్బంది పెడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి ఎన్నో ఇబ్బందులకు గురై ఇక్కడకు తెస్తే దాని కొనుగోలు చేయకపోతే ఇక రైతు బతికేదెలా. వ్యాపారుల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేయాలి. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్ధతు ధర కల్పించాలి.

తమ దృష్టికి రాలేదు

-ఆర్.సంతోష్‌కుమార్, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి, ఖమ్మం

ఉదయం మార్కెట్లో పలుమార్లు పర్యటించా. వ్యాపారులు కొనుగోలు చేయని విషయం మల్లుపల్లి రైతులు మా దృష్టికి తీసుకురాలేదు. మాసిబ్బంది కూడా యార్డులోనే ఉన్నారు. ఈవిషయంలో రైతులకు అన్యాయం జరిగితే సహించం. ఇప్పటికైనా సమస్య వారు తన దృష్టికి తెస్తే వారికి న్యాయం చేస్తా. యార్డులో ఈనామ్ విధానం అమల్లో ఉంది. వ్యాపారులు కచ్చితంగా రైతుల సరకు కొనుగోలు చేయాల్సిందే. దీనికి సంబంధించిన ధర సంబంధిత పంట వద్ద ఉన్న రాశిపై బహిరంగంగా ప్రకటించాలి.

పాఠశాలకు బస్సు వితరణ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: శ్రీసరస్వతి విద్యాపీఠం అనుబంధం 1960లో ఖమ్మంలో స్థాపించిన శ్రీరామకృష్ణావిద్యాలయం 51వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వవిద్యార్థి వీవీసీ, వీవీఆర్ గ్రూప్ ఛైర్మన్ వంకాయలపాటి రాజేంద్రప్రసాద్(రాజా) తన తండ్రి దివంగత వంకాయలపాటి వీరయ్యచౌదరి, సోదరుడు దివంగత వంకాయలపాటి వెంకటరమణ ప్రసాద్ జ్ఞాపకార్థం రూ.13లక్షల విలువైన స్కూల్ బస్సును పాఠశాలకు వితరణగా అందజేశారు. ఈసందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివి ఇంతటి వాడినైనందుకు తన వంతు సహకారంగా బస్సును వితరణగా అందజేసినట్లు చెప్పారు. పాఠశాల పూర్వ విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కటకం గిరి, బోనాల రామకృష్ణ, ప్రిన్సిపల్ సంకా గణేశ్, వీవీసీ, వీవీఆర్ సీఓ వెంకటేశ్వరరావు, సీఎఫ్ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థి వీవీ రాజేంద్ర ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తట్టు శాశ్వత నిర్మూలనే ధ్యేయం

నేటి నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం

దమ్మపేట, న్యూస్‌టుడే: తట్టు వ్యాధి పూర్తి నిర్మూలన, రుబెల్లా వ్యాధి నియంత్రణే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ఈనెల 17 నుండి నెల రోజుల పాటు ప్రత్యేక టీకాల కార్యక్రమాలు రూపొందించింది. దీనిలో భాగంగా 9 నెలల వయసు నుంచి 15 ఏళ్ల వయసు బాల, బాలికలందరికీ ఈ టీకాలను వైద్య, ఆరోగ్య అధికారులు వేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ రెండు రకాల వ్యాధులపై పోరాటం ప్రారంభించింది. దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాలు ఈ టీకాల కార్యక్రమం చేపట్టాయి. దీనిలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఈనెల 17 నుంచి ఈ టీకాల కార్యక్రమానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించింది.

ప్రతి విద్యార్థికీ ప్రత్యేక కార్డు...

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్ణీత తేదీల్లో, అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ప్రతి రోజూ ఈ టీకాలను అందుబాటులో ఉంచుతారు. నెల రోజుల కార్యక్రమంలో ఏ రోజు, ఏ సమయంలో టీకాలు వేస్తారు అనే వివరాలతో కూడిన కార్డును ప్రతి చిన్నారికీ ముందుగానే అందిస్తారు. కార్డులో సూచించిన విధంగా ఆ సమయంలో ఆరోగ్య సిబ్బంది వారి వద్దకే వచ్చి ఈ టీకాలను వేస్తారు.

వ్యాధి లక్షణాలు...

దద్దుర్లతో కూడిన జ్వరం రుబెల్లా వ్యాధి లక్షణం. గర్భిణులకు ఈ వ్యాధి సోకితే పుట్టబోయే పిల్లలకు కంటిచూపు కోల్పోవటం, వినికిడి సమస్య వంటి అంగవైకల్యం, గుండే, లివర్ సంబంధిత వ్యాధులు సంభవించే అవకాశం ఉంది. తట్టులో ఇటువంటి సమస్యలు లేకున్నా, అయిదేళ్ల లోపు చిన్నారులకు న్యుమోనియా, మందులకు లొంగని విరేచనాలు, మెదడు వాపుతో కూడిన మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ వ్యాధుల నివారణకు రుబెల్లా టీకాను ప్రభుత్వం సిద్ధం చేసింది. వైద్య ఆరోగ్యశాఖ వీటిని బాలలకు అందించే ఏర్పాట్లలో నిమగ్నమైంది.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ.3 లక్షల విలువైన రాగి తీగ, 29 చరవాణులు స్వాధీనం

బయ్యారం, న్యూస్‌టుడే: ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న రెండు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలను బయ్యారం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తితోపాటు సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న మరో వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి దొంగలముఠా వివరాలను వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇల్లెందు మండలం సుదిమళ్లకు చెందిన కందుకూరి అనిల్‌కుమార్ ఎలక్ట్రికల్ డిప్లొమా చేసి ఎలక్ట్రికల్ దుకాణంలో కొంతకాలం పనిచేశాడు. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే విలువైన రాగిని దొంగిలించడం ప్రారంభించాడు. ఇతనితోపాటు ఇల్లెందు మండలం మర్రిగూడెనికి చెందిన కుంజ శేఖర్ సాయంతో మహబూబాబాద్, వరంగల్, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలోని గ్రామాల్లో సుమారు 59విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసి కాపర్ దొంగిలించాడు. ఈ తీగను తీయడానికి ప్రత్యేక పరికరాన్ని తయారు చేసుకొని చోరీ చేసిన కాపర్‌తీగను బిల్లలుగా మార్చి అమ్మకాలు చేపట్టడం ప్రారంభించాడు. తనసొంత ఆటోలో ఈ కాపర్ బిల్లలను తరలిస్తూ విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్న గార్ల ఎస్సై వంశీధర్ అనుమానాస్పదస్థితిలో బుధవారం ఆటో కనిపించింది. దీంతో ఆటోను నిలిపి పరిశీలించగా దొంగతనంగా తరలిస్తున్న సుమారు 6క్వింటాల కాపర్ బిల్లలు కనిపించాయి. దీంతో ఎస్సై వంశీధర్ ఆటోను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై విచారించగా నాలుగు జిల్లాల్లో 59విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసినట్లు వెల్లడైంది. వారి నుంచి సుమారు రూ.3లక్షల విలువైన 6క్వింటాల కాపర్‌బిల్లలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కాపర్‌వైర్‌ను తరలిస్తున్న అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కుంజ శేఖర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరిపై మహబూబాబాద్ జిల్లాలో 22 చోరీ కేసులు, ఖమ్మంలో 6కేసులు, భద్రాద్రి కొత్తగూడెంలో 30కేసులు, వరంగల్ జిల్లాలో ఒక చోరీ కేసు... ఇలా మొత్తం 59చోరీ కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రాజమహేంద్రనాయక్, గార్ల, బయ్యారం సీఐ సాంబయ్య, ఎస్సై వంశీధర్, సిబ్బంది ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

చెడు వ్యసనాలకు అలవాటై... సెల్‌ఫోన్ చోరీలు

చెడు వ్యసనాలకు బానిసై సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన దట్ల మధుసూదన్ చెడు వ్యసనాలకు అలవాటుపడి సెల్ దొంగతనాలకు ప్రారంభించాడు. ఇతడు అత్యంత చాకచక్యంగా సెల్‌ఫోన్‌లను చోరీలను కొనసాగిస్తూ వస్తున్నాడు. రైళ్లలో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికులను పరిచయం చేసుకొని వారి నుంచి మా యింటికి ఒకఫోన్ చేసుకుంటానని నమ్మించి ఫోన్ మాట్లాడుతూ పరారయ్యే వాడు. ఇలా సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడుతూ మహబూబాబాద్‌లోని సెల్‌దుకాణాల్లో తక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. అంతేగాక సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న మధుసూదన్‌కు ఆ గ్రామానికి చెందిన ప్రవీణ్, వర్మ, ఉపేందర్, వీరబాబు, మహేశ్‌లతోపాటు మరో ముగ్గురు యువకులు దొంగతనాలకు అవసరమైన పెట్టుబడి పెట్టేవారు. ఇలా పెట్టుబడి పెడుతున్న వారు దొంగతనంగా తెచ్చిన సెల్‌ఫోన్‌లను తక్కువ ధరకు తీసుకునేవారు. ఈ నేపథ్యంలో అనుమానాస్పదంగా కనిపించిన మధుసూదన్‌ను పోలీసులు పట్టుకొని విచారించగా సెల్‌ఫోన్ చోరీకి పాల్పడుతున్న వ్యక్తిగా వెల్లడైంది. అతని నుంచి సుమారు రూ.3లక్షల విలువైన 29సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్పీ తెలిపారు.

రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

మధిర పట్టణం, న్యూస్‌టుడే: మధిరలోని రైలు నిలయం సమీపాన గుర్తుతెలియని యువకుడు(25) బుధవారం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తుమ్మల బాలస్వామి చెప్పారు. విజయవాడ వైపువెళ్లే లైనులో ప్లాట్‌ఫాం చివర ప్రాంతంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడు 5.6 అడుగుల ఎత్తు, ఎరుపు రంగు కోలముఖం కలిగి ఉన్నట్లు చెప్పారు. ఒంటిపై నలుపు, తెలుగు అడ్డగళ్ల చొక్కా, బ్లూ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బాలస్వామి తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న యువకుడు

ఆర్థిక ఇబ్బందులు తాళలేక...

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు మండలం పోలారం పంచాయతీ బొంబాయి తండాకు చెందిన ఇస్లావత్ రాంజీ(40) ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రాంజీ ఇటీవల ఆర్థిక సమస్యలు వెంటాడటంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు ఉన్నారు. కొమరారం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ నిరుపేద అయిన రాంజీ దహన సంస్కారాలకు రూ. 4,000 ఆర్థిక సాయం అందించారు. రాంజీ మృతితో బొంబాయి తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఇస్లావత్ రాంజీ మృతదేహం

ద్విచక్రవాహనం పైనుంచి పడి వ్యక్తి మృతి

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటనపై బుధవారం ఖమ్మం గ్రామీణ ఠాణాలో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆరెకోడుకు చెందిన ఆరెంపుల వెంకన్న(47) ఓ గ్యాస్‌గోదాములో పని చేసుకుంటూ పెద్దతండాలోని సాయిప్రభాత్‌నగర్ కాలనీలో గత కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై ఎం.వి.పాలెం వెళ్తుండగా ఒకేసారి సొమ్మసిల్లి వాహనం పైనుంచి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు చూసి 108 వాహనంలో చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగానే మృతిచెందాడు. సంఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.



జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన పోలీస్ బోర్డులను పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

జిల్లా సరిహద్దులను పరిశీలించిన మహబూబాబాద్ ఎస్పీ

బయ్యారం, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా సరిహద్దు మండలమైన బయ్యారం ప్రాంతంలో జిల్లా పోలీసు సరిహద్దు ప్రాంతాలను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి బుధవారం పరిశీలించారు. గతంలో ఉన్న సరిహద్దుల్లో స్వల్ప మార్పులు జరిగినట్లు ఎస్పీ తెలిపారు. ఇల్లెందు, బయ్యారం మండల సరిహద్దు నామాలపాడు సమీపంలోని పోలీసు సరిహద్దు మరో కిలోమీటర్ దూరం పెంచిన ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించారు. బయ్యారం, మహబూబాబాద్ సరిహద్దులో ఉన్న పాకాలవాగు వంతెన బయటభాగం వరకు బయ్యారం పోలీస్‌పరిధికి వస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మహబూబాబాద్ డీఎస్పీ రాజమహేంద్రనాయక్, సీఐ సాంబయ్య తదితరులు ఉన్నారు.

జాతీయ జెండాను అవమానించిన రేంజర్ సస్పెన్షన్

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: జాతీయ జెండాను అవమానించిన రేంజర్ సదానందాచారి సస్పెన్షన్‌కు గురయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండాను ఎగరవేకపోవడంతోపాటు, మద్యం తాగి ఇష్టారీతిన వ్యవహరించినందుకు అచ్యుతాపురం అటవీ పరిశోధనా కేంద్రం రేంజర్ సదానందాచారిని అటవీపరిశోధనా విభాగం వరంగల్ డీఎఫ్‌వో పురుషోత్తం సస్పెండు చేశారు. ఆయన విధులను వరంగల్-1 రేంజర్ నాగిని భానుకు అప్పగిస్తూ బుధవారమే ఆదేశాలిచ్చినట్లు డీఎఫ్‌వో తెలిపారు. అచ్యుతాపురం అటవీ పరిశోధనా కేంద్రం బీటు అధికారి లక్ష్మారావు, రీసెర్చ్ స్కాలర్ తిరుపతిరెడ్డిని హుటాహుటిన బుధవారం డీఎఫ్‌వో వరంగల్ పిలిపించి ఇరువురినీ విచారించి వారి నుంచి లేఖలు తీసుకున్నారు. పత్రికా కథనాలు, స్థానిక సిబ్బంది వివరణల నేపథ్యంలో సదానందాచారిని సస్పెండు చేస్తున్నట్లు డీఎఫ్‌వో తెలిపారు.



సదానందాచారి

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి మండలం కొత్తలంకపల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున అదృశ్యమైన చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెనికి చెందిన షేక్ సద్దాం హుస్సేన్(26) మృతదేహం బుధవారం సమీపంలోని ఓ బావిలో లభ్యమైంది. సంఘటన స్థలానికి కల్లూరు ఏసీపీ రాజేశ్, గ్రామీణ సీఐ మడత రమేశ్ చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి శవ పంచనామా నిమిత్తం పెనుబల్లి వైద్యశాలకు తరలించారు. ఈ కేసును అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వీఎం బంజర్ ఎస్సై నరేశ్ తెలిపారు.

బంధువుల ఆందోళన...

శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని తీసుకెళ్లకుండా మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు. పెనుబల్లికి చెందిన విజయకృష్ణ ట్రాన్స్‌పోర్టులో బొగ్గు టిప్పర్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న సద్దాం హుస్సేన్‌కు యాజమాన్యం న్యాయం చేయాలంటూ వైద్యశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. దీంతో సీఐ రమేశ్ మృతుని బంధువులతో మాట్లాడినా మృతుని కుటుంబానికి న్యాయం జరిగే వరకు తాము ఈ ఆందోళన చేస్తామని భీష్మించారు. చివరకు ట్రాన్స్‌పోర్టు యాజమాని తరఫున కొందరు వ్యక్తులు యాజమానితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

అయ్యన్నపాలెంలో విషాదం

చంద్రుగొండ, న్యూస్‌టుడే: కుటుంబానికి ఆధారమైన సద్దాం హుస్సేన్ మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. హుస్సేన్‌కు భార్య, ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. కుటుంబానికి ఆధారమైన సద్దాం హుస్సేన్ ఇకలేడని తెలుసుకొన్న కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. మా నాన్నకు ఏమైంది, అందరు ఎందుకు ఏడుస్తున్నారని హుస్సేన్ బిడ్డలు అడగటం చూపరులను కంటతడి పెట్టించింది.



హుస్సేన్ మృతుడు (దాచిన చిత్రం)



బావిలో తేలిన మృతదేహం, సంఘటన స్థలంలో ఏసీపీ రాజేశ్, సీఐ రమేశ్

అశ్రునయనాలతో వీడ్కోలు

విజయకుమార్ అంతిమ యాత్రలో పాల్గొన్న వామపక్ష నాయకులు

కొత్తగూడెం రామవరం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రముఖ వైద్యుడు మద్దికాయల విజయ్‌కుమార్, డా.యూన్నీలక్ష్మీ తల్లి సావిత్రీబాయి అంత్యక్రియలను అశ్రునయనాల నడుమ రామవరం శశ్మానవాటికలో నిర్వహించారు. ఆగస్టు 14న నల్గొండ జిల్లా కట్టంగూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో డా.విజయ్‌కుమార్, సావిత్రీబాయి మృతిచెందగా, డా.యూన్నీ కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. బుధవారం కొత్తగూడెం పోస్టాఫీస్ ఏరియాలోని స్వగృహంలో డా.విజయ్‌కుమార్ మృతదేహం వద్ద ఎంసీపీఐ(యూ) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి మద్ది వెంకటరెడ్డి, సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యుడు బుర్రా విజయ్‌కుమార్, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఆకునూరి మురళి, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందు మాజీ శాసనసభ్యుడు గుమ్మడి నర్సయ్య పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ అంబర్‌కిశోర్ ఝా అంతియయాత్రలో నివాళులర్పించారు. ఎంసీపీఐ(యూ) ప్రజానాట్య మండలి సభ్యులు కళాప్రదర్శనలతో ముందుకు సాగారు. అనంతరం ప్రత్యేక వాహనంలో రామవరంలోని శశ్మానవాటికకు అంతిమ యాత్ర చేరుకుంది. సీపీఎం, సీపీఐ కార్యాలయాల వద్ద పార్టీ జెండాలను పక్కకు వంచి ఇరు పార్టీల కార్యకర్తలు కాసాని అయిలయ్య, సాబీర్‌పాషాలు నివాళులర్పించారు. రామవరం శ్మశానవాటికలో విజయ్‌కుమార్‌కి తనయుడు హర్ష, సావిత్రీబాయి తనయుడు సత్యనారాయణ అంత్యక్రియలు నిర్వహించారు. ఐఎంఏ ఆధ్వర్యంలో పట్టణ వైద్యులు, గూడెం న్యాయవాదులు నల్లబ్యాడ్జీలను ధరించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. వివిధ పార్టీల నాయకులు ఎన్.సంజీవ్, సతీష్, రజాక్, మండే వీరహనుమంతరావు, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, సత్యనారాయణ, భూక్యా రమేశ్ పాటు వరంగల్, ఖమ్మం, భద్రాద్రి తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

డా.యూన్నీ ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉందని, త్వరలో ఆమె కోలుకొని తిరిగి వైద్యసేలను అందిస్తుందని జడ్పీ ఛైర్‌పర్సన్ గడిపల్లి కవిత, మాజీ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో డా.యూన్నీని ఆసుపత్రిలో వేర్వేరుగా సందర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.



అంతిమయాత్రకు హాజరైన పురప్రజలు

"విద్యార్థుల్లో నిద్రాణమై ఉన్న విజ్ఞానాన్ని వెలికితీసి మార్గ నిర్దేశనం చేసే పలుకులకు వేదిక అది... లక్ష్య సాధనకు చేయూత అందిస్తూ నడిపించే సురక్షిత బాట.. ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి చేర్చే వారధి అశ్వారావుపేట ప్లేస్‌మెంట్ సెల్'' ఇదో విజ్ఞాన భాండాగారం. అభ్యర్థులకు విజ్ఞానాన్ని విపులీకరించి వారిని లక్ష్యం దిశగా తీర్చిదిద్దడటమే ప్లేస్‌మెంట్ సెల్ కర్తవ్యం.

దిక్సూచి

విద్యార్థులకు వెలుగు బాట

అశ్వారావుపేట ప్లేస్‌మెంట్ సెల్

10 ఏళ్లలో 400 మందికి లబ్ధి

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

యువత ఉన్నత చదువులకు వెళ్లాలన్నా.. ఉద్యోగాల బాట పట్టాలన్నా.. ఉన్నత లక్ష్యాల సాధనలో ప్లేస్‌మెంట్ సెల్ కీలక పాత్ర పోషిస్తోంది. ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన అశ్వారావుపేట ప్లేస్‌మెంట్ సెల్ మార్గదర్శకంగా నిలుస్తోంది. ప్లేస్‌మెంట్ సెల్ అనగానే ఇదేదో ఉద్యోగాలను తీసుకొచ్చి ఇచ్చే సంస్థ కాదు.. ఉన్నత చదువులకు సీట్లు ఇప్పించే బాధ్యత తీసుకోదు.. వాటన్నింటినీ మించి మార్గనిర్దేశనం చేస్తూ ఉద్యోగాలకు వెళ్లేవారు ఎలా సిద్ధం కావాలి, ఉన్నత చదువులకు వెళ్లేవారు ఎలా తయారు కావాలో మార్గం చూపిస్తోంది. ఈ విజ్ఞాన ఘనికి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల వేదికగా నిలిచింది.

పైసా చెల్లించనవసరంలేదు

ఈ ప్లేస్‌మెంట్ సెల్‌కు విద్యార్థులు ఏవిధమైన సొమ్ములు చెల్లించాల్సిన పనిలేదు. విద్యార్థులకు అయ్యే ఖర్చులన్నీ విశ్వవిద్యాలయమే భర్తిస్తోంది.

పుస్తకాలు, ఇతర సామాగ్రిని విశ్వవిద్యాలయం ఈ కళాశాలలో అందుబాటులో ఉంచుతోంది. అందుకయ్యే ఖర్చును విశ్వవిద్యాలయమే భరిస్తోంది.

అవసరమైతే కళాశాలలో ఉన్న కంప్యూటర్ ఉపయోగించుకుని అవకాశాలను వెతకొచ్చు. ఇందుకు ఆచార్యులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారు.



ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా విద్యార్థులకు మార్గనిర్దేశనం చేస్తూ...

ఎలా పనిచేస్తోంది..?

ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో పదేళ్ల క్రితం ఏర్పాటైన ఈ ప్లేస్‌మెంట్ సెల్ ఎందరో విద్యార్థులకు ఉద్యోగాలను కల్పించింది. మరెందరో మంది విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేసింది.

ఎక్కడెక్కడ ఉద్యోగాలున్నాయో ఈ సెల్ చిరునామాలతో సహా వెల్లడిస్తోంది. అర్హతలు, జీతం, విధులు, బాధ్యతలు వివరంగా తెలుపుతారు.

ఉన్నత చదువులకు దేశీయంగా, అంతర్జాతీయంగా ఎక్కడెక్కడ అవకాశాలున్నాయో తెలుసుకునే అవకాశం ఈ సెల్ ద్వారా ఉంది.

ఇందుకు సంబంధించిన సమస్త సమాచారం ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే వెసులుబాటును విశ్వవిద్యాలయం కల్పిస్తోంది.

ఇందుకోసం కళాశాలలో ఒక ఆచార్యుడిని బాధ్యుడిగా నియమించారు. ప్రతివారం లేదా 15 రోజులకో సారి విద్యార్థులకు మార్గనిర్దేశనం జరుగుతోంది.



ఇదో మార్గదర్శిని



ప్లేస్‌మెంట్ సెల్ ఒక మార్గదర్శిని. విద్యా, ఉద్యోగాల కల్పనలో ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌ఛార్జిలు అందించే సహకారం విశేషమైనది. ఉద్యోగాలకు దరఖాస్తు చేయడం తెలుసు, కాని ఎలా చేస్తే మన దరఖాస్తు పరిగణలోకి తీసుకుంటారో ప్లేస్‌మెంట్ సెల్ సూచిస్తోంది.

- సీహెచ్ మౌనిక, ఏజీబీఎస్సీ తృతీయ సంవత్సరం

సమస్యలకు పరిష్కార వేదిక



ప్లేస్‌మెంటు సెల్ అనగానే ఇదేదో ఉద్యోగాలు ఇచ్చేదికాదు. మనలో ఆలోచనలకు చక్కటి పరిష్కారం చూపే వెలుగులాంటిది. సమస్యలను ఎలా చేస్తే అధిగమించొచ్చో చక్కగా వివరిస్తారు. ఉన్నత చదువు మెట్లు ఎక్కాలంటే ఎలా ప్రయత్నించాలో సూచించే పరిష్కార వేదిక.

- ఆర్.సాయిరచన, ఏజీబీఎస్సీ తృతీయ సంవత్సరం

పదేళ్లు.. 400..!

అశ్వారావుపేట ప్లేస్‌మెంట్ సెల్ ప్రారంభించిన ఈ పదేళ్లలో 400 మందికి పైగా లబ్ధి పొందారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు పొందారు. ఎంతోమంది ఎంటర్‌ప్రెన్యూర్లుగా రాణిస్తున్నారు. పలువురు విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ అశ్వారావుపేట విద్యార్థులున్నారంటే అతిశయోక్తి కాదు. బ్యాంకులు, కళాశాల ఆచార్యులు, పరిశోధకులు, ఆర్డీవోలు, వ్యవసాయ అధికారులుగా, ఇతర ఉద్యోగాల్లో అవకాశాలను అందిపుచ్చుకున్నారు. ఈ ఘనత ప్లేస్‌మెంట్ సెల్‌దేనని చెపుతుంటారు.

వెలుగుబాట..

అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో పదేళ్లుగా నిర్వహిస్తోన్న ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా ఎంతోమంది ఉద్యోగాలు పొందారు. మరెందరో ఉన్నత చదువులకు వెళ్లారు. ఈ పదేళ్ల కాలంలో 400 మందికి మార్గదర్శనం చూపింది. నేడు వారంతా ఉన్నత చదువులు, ఉన్నతోద్యోగాల్లో రాణిస్తున్నారు. అవకాశాలను అందుకునేందుకు విద్యార్థి కృషి చేయాలి.

- డాక్టర్ బి.విద్యాధర్, ఆచార్యులు, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ బాధ్యుడు

చేయగలమనే ధైర్యాన్నిస్తోంది

జి.వైభవ్‌కుమార్, ఏజీబీఎస్సీ



మేము చేయగలము.. సాధించగలము.. అనే ధైర్యాన్ని ప్లేస్‌పెంట్ సెల్ కల్పిస్తోంది. మనలో ఉండే సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు బాటలు వేస్తోంది. భయంతో ఎంతోమంది ఉద్యోగాన్వేషణల్లో, ఉన్నత చదువుల్లో వెనుకబడిపోతుంటారు. అలాంటి వారందరికీ ఇదొక భగవద్గీతలా ధైర్యం చెబుతోంది.

శోధన, సాధనకు సహకారం

ఎస్.ప్రశాంత్, ఏజీబీఎస్సీ



పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు ఎక్కడెక్కడ అవకాశాలున్నాయి, సీట్లు ఎన్ని, కళాశాలల గుర్తింపు ఎలా ఉంది? మొదలగు అంశాలను శోధించేందుకు ఈసెల్ ఉపయోగపడుతోంది. అదేవిధంగా ఉద్యోగాల దరఖాస్తులు ఆహ్వానిస్తోన్న సంస్థల సమగ్ర సమాచారం తెలియజేసేందుకు ఈ సంస్థ ఎంతగానో కృషి చేస్తోంది.

U-17 WORLD CUP INDIA 2017 FIFA

ఖమ్మం జిల్లాకు వచ్చినవి: **500**

మిషన్ 11 మిలియన్ లక్ష్యం: దేశంలో 1.1 కోట్ల మంది ఫుట్‌బాల్ క్రీడాకారుల నమోదు

కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి: ఫుట్‌బాల్‌ల పంపిణీ

ఇప్పటికే దేశంలో కొనుగోలు చేసిన బంతులు: **6 కోట్లు**

ఫుట్‌బాల్‌కు జవజీవాలు



జిల్లాలోనూ ప్రచారం..

లెవెన్ మిలియన్ నినాదంతో కొలువు దీరనున్న ప్రపంచకప్ పోటీలను ప్రచారం చేస్తున్న క్రమంలోనే ఫుట్‌బాల్ ఆటపై అవగాహన కల్పించి సాధ్యమైనంత ఎక్కువ మంది ఆడే విధంగా చూడాలని ఇప్పటికే జిల్లా విద్యాశాఖ, జిల్లా ఫుట్‌బాల్ సంఘం, జిల్లా యువజన, క్రీడలశాఖకు ఆదేశాలు అందాయి. జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఈ నెల 9న ఖమ్మం నగరంలోని రోటరీ లింబ్ సెంటర్లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో రాష్ట్ర, జాతీయ స్థాయి, ఫుట్‌బాల్ సమాఖ్య అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు, ఫుట్‌బాల్ సీనియర్ క్రీడాకారులను ఆహ్వానించారు. సమావేశంలో జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య సభ్యులు, పలువురు అధికారులు పాల్గొని ప్రపంచకప్ ఫుట్‌బాల్ పోటీల తీరుతెన్నూ, ఈ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో ఫుట్‌బాల్ అభివృద్ధికి చేయాల్సిన పనులను వివరించడంతోపాటు ఫుట్‌బాల్ బంతులుకూడా ఇచ్చారు.

కొద్ది పాటి స్థలం ఉన్నా ఫుట్‌బాల్ ఆట అలవర్చుకోవాలనే ప్రచారం

మిషన్ 11 మిలియన్‌తో ఫుట్‌బాల్ రంగంలో సందడి

పాత ఆలోచనా విధానానికి స్వస్తి



ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య(ఫిఫా) పరిధిలోని అండర్-17 ప్రపంచకప్ ఫుట్‌బాల్ పోటీలు అక్టోబరు 6 నుంచి 28వ తేదీ వరకు భారతదేశంలోని మహానగరాల్లో జరుగనున్నాయి. దేశంలో ఫుట్‌బాల్ ప్రమాణాలు అడుగంటుతున్న తరుణంలో ఈరంగానికి జవజీవాలు కల్పించేందుకు నేరుగా కేంద్ర ప్రభుత్వమే రంగంలోకి దిగింది. ఫుట్‌బాల్ ఆడాలంటే 11 మంది క్రీడాకారులు ఉండాలి. పది ఎకరాలకు తగ్గని స్థలం ఉండాలి అని ఆలోచించుకుంటూ కూర్చున్న ఫలితంగా దేశంలో ఫుట్‌బాల్ కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు ఫిఫా పోటీల సందర్భంగా తెరపైకి వచ్చిన మిషన్ 11 మిలియన్ విభాగం ఆటకు కొత్త నిర్వచనం సూచించింది. ఒక బంతి ఉంటే ఉన్న స్థలంలోనే ఆడుకోండి. ముందు బంతిని తన్నడం అలవాటు చేసుకోండి ఆ తర్వాత ఆట అదే వస్తుందనే కొత్త కోణాన్ని ప్రచారంలోకి తెచ్చింది.

ఆ దేశాల్లో అదే పద్ధతి పాటిస్తారు

మిషన్ 11 మిలియన్ పేరుతో భారత ప్రభుత్వం, జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య అక్టోబరు ఆరు నుంచి దేశంలో ఫిఫా అండర్ 17 ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభించే నాటికి 11 మిలియన్ల మంది ఫుట్‌బాల్ క్రీడాకారుల పేర్లు నమోదు చేయాలనే లక్ష్యంతో ఉన్నాయి. అంటే 1.1 కోట్ల మంది భారత దేశంలో ఫుట్‌బాల్ ఆటకు సిద్ధంగా ఉన్నారని నిరూపించాలనే సంకల్పంతో మిషన్ 11 మిలియన్ పని ప్రారంభించింది. ఫుట్‌బాల్ రంగంలో రాటుదేలిన బ్రెజిల్, అర్జెంటీనా, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో పాఠశాలకు వెళ్లే ప్రతీ పిల్లాడు ఒక బంతితో ఉంటాడు. ఆ బంతిని తన్నుకుంటూ పాఠశాలలకు వెళ్లే వారే అధికంగా ఉంటారు. ఈక్రమంలో చిన్నతనంలోనే పిల్లలకు బంతిపై నియంత్రణ అలవడుతుంది. వారే మైదానాలకు వెళ్లి తమ ప్రతిభను నిరూపించుకుంటారు. ఇలాంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని భారత దేశంలోకూడా ఇలాంటి ప్రయోగం చేయాలనే ఉద్దేశంతో మిషన్ 11 మిలియన్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే ఆరు కోట్ల ఫుట్‌బాల్ బంతులు కొనుగోలు చేశారు. వాటిని దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాకు 500 బంతులు వచ్చాయి. బంతులు దశలవారిగా అందజేస్తున్న క్రమంలోనే జిల్లా సంఘాలు ప్రతీ పాఠశాలకు వెళ్లడంతోపాటు మిషన్ 11 మిలియన్ కోసం పేర్లు నమోదు చేయాలి. బంతులు విరివిరిగా అందించాలనే ఆదేశాలు ఉన్నాయి.



జిల్లాలో గతమెంతో ఘనం.. కృషితో పూర్వ వైభవం

జిల్లా ఫుట్‌బాల్ రంగానికి ప్రత్యేక గుర్తింపు ఉండేది. 1959 నుంచి 61 వరకు వరుసగా జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించిన ఘనత ఖమ్మానికే సొంతం అయ్యింది. నాటి రోజుల్లోనే ఖమ్మం పెవిలియన్ మైదానంలో దేశంలోనే పేరొందిన జాతీయ జట్లు ఆడాయి. ఆసియా ఫుట్‌బాల్ రంగంలో పేరుగాంచిన భారత దేశ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించిన పశ్చిమ్ బంగ, ఆర్మీ, మొహన్ బగాన్, జేసీటీ, మహమ్మడన్ స్పోర్టింగ్‌క్లబ్, హీరోస్‌క్లబ్, గోవా, కేరళ జట్లు జాతీయ పోటీల కోసం ఖమ్మం వచ్చాయి. 1980 వరకు జిల్లాలో ఫుట్‌బాల్ అత్యంత ఆదరణ కల్గిన క్రీడాంశంగా కొనసాగింది. 1976లో ఫుట్‌బాల్లో రాణించిన పది మంది క్రీడాకారులకు నాటి జిల్లా యంత్రాంగం ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. నాటి నుంచి రాష్ట్ర, జాతీయ ఫుట్‌బాల్ రంగాల్లో వచ్చిన మార్పులు జిల్లా ఫుట్‌బాల్ రంగాన్ని కుదిపి వేశాయి. పోటీలు కరవు కావడంతో క్రమంగా క్రీడాకారుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఖమ్మంలో ఫుట్‌బాల్ అకాడమి ఏర్పాటు చేసినప్పటికీ ఫలితాలు లేక, క్రీడాకారులు ఆడేందుకు పోటీలు లేక క్రీడాకారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో అకాడమి ఇక్కడి నుంచి ఎత్తేశారు. నాటి ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి సుధాకర్‌రాజు ఒంటరి పోరాటం చేస్తూ జిల్లాలో ఫుట్‌బాల్ ఉనికిని కాపాడుకుంటూ వచ్చిన తీరు కొన్ని జట్లకు ఊపిరిలూదింది. ఇలాంటి ఘన చరిత్ర ఉన్న ఖమ్మం ఫుట్‌బాల్ రంగానికి పూర్వ వైభవం చేకూర్చే సందర్భంగా ఫిఫా పోటీల ప్రచారాన్ని వినియోగించుకోవాలని ఫుట్‌బాల్ సమాజం కృషి చేస్తోంది.

సమష్టి బాధ్యతగా ఫుట్‌బాల్ అభివృద్ధి

ఆదర్శ్ కుమార్, జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి

ఫుట్‌బాల్‌కు ఆదరణ కల్పించేందుకు మిషన్ ఎలెవెన్ మిలియన్ పేరుతో ఒక మహత్తర కార్యక్రమం కొనసాగుతోంది. దేశ చరిత్రలో ఎన్నడు ఎరగని రీతిలో ఒక క్రీడాంశాన్ని అభివృద్ధి చేసేందుకు ఏకంగా ప్రభుత్వమే రంగంలోకి దిగింది. ఇలాంటి అవకాశం, ఇంతటి ప్రోత్సాహం గతంలో ఎన్నడూ లేదు, రాదుకూడా. ఇలాంటి తరుణంలో యావత్తు క్రీడా సమాజం ఫుట్‌బాల్ అభివృద్ధిని సమష్టిబాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన సదస్సులో చెప్పిన విధంగా వ్యాయామ ఉపాధ్యాయులు మిషన్ ఎలెవెన్ మిలియన్ వెబ్‌సైట్లో ఔత్సాహిక క్రీడాకారుల పేర్లు నమోదు చేయాలి. ఈ ప్రక్రియను విజయవంతం చేసేందుకు జిల్లా ఫుట్‌బాల్ సంఘం ప్రతీ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనుంది.

మట్టి గణపతికి జైబోలో!

వినాయక చవితి.. కావాలి పర్యావరణ హితం
ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పర్యావరణానికి ముప్పు
ప్రజల్లో పెరుగుతున్న చైతన్యం

సత్తుపల్లి, న్యూస్‌టుడే

ఆదిదేవుని పూజలంటే అందరిలో భక్తి పారవశ్యం ఉప్పొంగుతుంది. గణేశ్ ఉత్సవాల సందడి మొదలౌతోంది. మరికొన్ని రోజుల్లో వీధి వీధినా వినాయకుడు కొలువు దీరనున్నాడు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, వాటికి వినియోగించే ప్రమాదకర రంగులతో జీవరాసి మనుగడకు ముప్పు పొంచి ఉంది. పర్యావరణంతో పాటు జలచరాలు, పంట పొలాలకు నష్టం చేకూరుతోంది. పార్వతీదేవి నలుగు పిండితో ఆవిర్భవించిన గణపతికి ప్రకృతి సహజసిద్ధ పత్రాలతో పూజించడమే ఆచారం. గణపతిని పూజించే జిల్లేడు, గన్నేరు, జాజి తదితర పత్రాలు, పూలు ఆయుర్వేద వైద్య మూలికలే. ఆదిశగా ప్రజల్లోనూ అవగాహన పెరగాల్సి ఉంది.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నిర్మాణంలో ఉపయోగించే పదార్థం జిప్సమ్. దీనిని 150 డిగ్రీలు సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద మండించగా ఇది తయారవుతుంది. ఇది నీటిలో, భూమిలో కరగటానికి చాలారోజులు పడుతుంది. ఈ విగ్రహాలను నిమజ్జనం చేసినప్పుడు ఆ నీటిలో ఆక్సిజన్ స్థాయి పడిపోతుంది. ఫలితంగా ఆ నీటిలో నివసించే జీవరాసులకు ఊపిరి ఆడటం కష్టమౌతుంది. కాల్షియం, మెగ్నీషియం, సిలికాన్, సల్ఫర్‌లతో పాటు లెడ్, మెర్క్యూరీ వంటి రసయానాలు విడుదలవుతాయి. ఈ విగ్రహాలను చెరువులు, నదుల్లో నిమజ్జనం చేయటం వలన నీటిలోని సహజ లవణాలు నశిస్తున్నాయి.

విగ్రహాలకు అద్దే రసాయనిక రంగులతో జలచరాలు, మనుషులపై చెడు ప్రభావం ఉంటోంది. ఈ రసాయనాలు కలిసిన నీటితో పంటలు పండిస్తే అవి విషతుల్యమయ్యే ప్రమాదముంది. తద్వారా శ్వాస కోశ, రక్త, చర్మ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదముందని శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు.



సత్తుపల్లి గణేశ్ ఉత్సవ కమిటి ఉత్సవాల్లో గత ఏడాది కొలువుదీరిన మట్టి గణనాథుడు

మట్టి విగ్రహాలు వినియోగించేందుకు సంస్థలు కృషి

మట్టి వినాయక విగ్రహాలు వినియోగంపై ఉభయ జిల్లాల్లో చైతన్యం నింపేందుకు ప్రభుత్వంతో పాటు అనేక స్వచ్ఛంద సంస్థలు, ప్రకృతి ప్రియులు కృషి చేస్తున్నారు. గతంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో తక్కువ ధరకే (రూ. 5కే) మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు.

సత్తుపల్లిలో ఏటా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా ఏటా 2వేల మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేస్తున్నారు. ఇక్కడ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏటా పెద్ద సైజు మట్టి గణపతిని ఏర్పాటు చేస్తున్నారు.

ఉత్సవ కమిటీల చైతన్యంతో.. నవరాత్రి ఉత్సవాల్లో ఎంత పెద్ద విగ్రహం ఏర్పాటు చేస్తే సమాజంలో అంత గొప్పగా, గౌరవంగా భావిస్తున్నారు. ఈ భావనతోనే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ఎత్తు, బరువు ప్రమాణం కాదని ఉత్సవ కమిటీలు గుర్తించాలి. ఆర్భాటాలకు పోకుండా తక్కువ వ్యయంతో, భక్తి శ్రద్ధలలో పర్యావరణానికి నష్టం కలగని రీతిలో మండపాల్లో పూజలు నిర్వహించేలా చైతన్యంతో వ్యవహరించాలి.

ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, మధిర తదితర పట్టణాల్లో స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాల గురించి ప్రచారం నిర్వహిస్తున్నాయి.



మట్టి గణనాథులు


మట్టి గణపతే..

సత్తుపల్లి గణేశ్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. కొన్నేళ్లుగా మట్టి గణపతినే ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నాం. ఈ ఏడాదీ కలకత్తా కళాకారులచే ఏలూరులో రూ. 80 వేలు వెచ్చించి మట్టి గణపతి విగ్రహాన్ని చేయించాం. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఇళ్లలో పూజలు చేసుకునే వారికి గతంలో మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశాం.



కూసంపూడి శ్రీనివాసరావు, గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, సత్తుపల్లి.

వాడి పెరిగేలా.. నాడి పట్టేలా



సత్వర సేవలకు ఈ-లెర్నింగ్ శిక్షణ
జిల్లాలో 355 మంది అధికారుల ఎంపిక

కొత్తగూడెం సంక్షేమవిభాగం, న్యూస్‌టుడే

ప్రజలకు మెరుగైన సత్వర సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అధికారులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించనున్నారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు వ్యూహరచన, సమస్యల పరిష్కారం, ఒత్తిడిని జయించడం తదితర అంశాలపై ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. అధికారులు, ఉద్యోగుల నైపుణ్యాలను పెంపొందించేందుకు నేషనల్ ట్రైనింగ్ పాలసీ కింద కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఎంపికచేసింది. ఈ క్రమంలో సర్కారు ఈ-లెర్నింగ్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించడంతో ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 19 నుంచి మూడు రోజులపాటు 15 అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. సుమారు 70 ప్రభుత్వ శాఖలకు చెందిన 355 మంది అధికారులను శిక్షణకు ఎంపిక చేశారు.

ప్రభుత్వ పాలన వ్యవహారాలపై అన్ని విభాగాల అధిపతులకు, తర్వాత శ్రేణి(ద్వితీయ) అధికారులకు, ఉద్యోగులకు ఈ-లెర్నింగ్ శిక్షణ ద్వారా దిశానిర్దేశం చేసి ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అధికారులు, ఉద్యోగుల నైపుణ్యాలను పెంపొందించేందుకు నేషనల్ ట్రైనింగ్ పాలసీ కింద కేంద్ర ప్రభుత్వం మొదట పైలెట్ ప్రాజెక్టు కింద హరియాణా, మహారాష్ట్ర, తమిళనాడు, అసోం, పశ్చిమ బంగతోపాటు తెలంగాణ రాష్ట్రాన్ని ఎంపికచేసింది. ఇందులో భాగంగా తెలంగాణ సర్కారు ఈ-లెర్నింగ్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించడంతో ఆ దిశలో కసరత్తు చేస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఈ నెల 19, 21, 22వ తేదీల్లో 15 అంశాలపై మొత్తం 28 గంటలపాటు శిక్షణ ఇవ్వనున్నారు.

కమిటీ ఇలా..

ఈ-లెర్నింగ్ శిక్షణ విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కమిటీని నిర్ణయించింది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ చైర్మన్‌గా, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎం.బాలశౌరి కన్వీనర్‌గా, సభ్యులుగా డీఈఓ హయగ్రీవాచారి, ట్రైనింగ్ కోఆర్డినేటర్‌గా లైజన్ ఆఫీసర్ ఎ.అశోక్, టెక్నిల్ ఆఫీసర్‌గా ఈ- జిల్లా మేనేజర్ నాయిని లక్ష్మణ్ రావు వ్యవహరించనున్నారు. వీరు శిక్షణ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు, ఇతర మౌలిక వసతులు కల్పించే చర్యలు తీసుకుంటారు.

ఉద్దేశం

మారుతున్న సాంకేతిక, పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు చేరువయ్యేందుకు ప్రభుత్వ వివిధ శాఖాధిపతులు, ఉద్యోగులు అనుసరించాల్సిన విధానం
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలకు అనుగుణంగా నిర్దేశిత లక్ష్యాలను చేరుకొనేందుకు వ్యూహరచన చేసుకోవడం
సమస్యలకు పరిష్కారంలో ఒత్తిడి జయించడం
శాఖాధిపతులు అనుసరించాల్సిన వ్యూహం
అధికారి తాను ఏర్పాటుచేసుకున్న బృందాన్ని ఎలా ఉత్తేజపరచాలి? శాఖకు సంబంధించిన లావాదేవీల నిర్వహణ ఎలా ఉండాలి?
శిక్షణలో భాగంగా ప్రతి శిక్షకుడికి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను కేటాయిస్తారు.

పాల్గొనే అధికారులు

జిల్లా స్థాయి, రెండో శ్రేణి అధికారులు	80
ఆర్డీవోలు	3
తహసీల్దార్లు	20
ఎంపీడీవోలు	12
ఎంపీవోలు	20
ఎంఈవోలు	20
ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు	200

ఎక్కడ ఇస్తున్నారు?

శిక్షణ ఎక్కడ?: పాల్వంచలోని అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో
తేదీలు: ఈ నెల 19, 21, 22
రోజుకు ఎంతమంది: 100 మందికిపైగా
శిక్షణ కాలం: ఉ.10.00 గంటల నుంచి

శిక్షణ అంశాలు: 15



శిక్షణ అంశాలకు కేటాయించిన సమయం (నిమిషాల్లో)

అంశం	సమయం
గోల్‌సెట్టింగ్ (లక్ష్య నిర్దేశం)	45
వ్యక్తిగత, వృత్తిగత విలువలు	70
సమయ పాలన	60
సమస్య పరిష్కారం, సత్వరం నిర్ణయం	90
టీం బిల్డింగ్	60
నాయకత్వం	75
ఒత్తిడి జయించడం	60
భావ వ్యక్తీకరణ	120
కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్	60
పర్సనల్, ప్రొఫెషనల్ ఎఫెక్టివ్‌నెస్	60
ప్రేరణ	75
ఎమోషనల్ ఇంటిలిజెన్స్	70
రైట్ టూ ఇన్ఫర్‌మేషన్	75
కార్యాలయ విధివిధానాలు	90
ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ నిర్వహణ	75

అంతా ఆ సేవలోనే..

పురపాలక వాహనాల్లో సామగ్రి తరలింపు
కొత్తగూడెం పురపాలకంలో ఓడీఎఫ్ కష్టాలు



చెత్తను తరలించే వాహనంలో మరుగుదొడ్ల నిర్మాణ సామగ్రిని తీసుకొచ్చిన దృశ్యం

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

రెండేళ్లు కాలయాపన చేశారు. అడిగేవారు లేకపోవడంతో ఆడిందే ఆట.. పాడిందే పాటగా వ్యవహరించారు. ముప్పు ముంచుకొచ్చేసరికి అధికార దుర్వినియోగానికి యత్నిస్తున్నారు. అసలే లక్ష్యాన్ని కుదించేశారు. దాన్ని సైతం ఛేదించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. చెత్తను తరలించాల్సిన వాహనాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన సామగ్రిని తరలిస్తున్నారు. కిన్నెరసాని నీటి సరఫరా, విద్యుత్తు బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించాల్సిన సిబ్బందిని సైతం సూపర్‌వైజర్లుగా కేటాయించేశారు. సగం మంది పురపాలక సిబ్బందిని స్వామిసేవకు వినియోగించేస్తున్నారు. ఇవన్నీ స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ నినాదంతో ప్రభుత్వం తలపెట్టిన బహిరంగ మల, మూత్రవిసర్జన రహితంగా తీర్చిదిద్దేందుకు కొత్తగూడెం ప్రథమ శ్రేణి పురపాలకానికి వచ్చిన తిప్పలు.

ఈ నెల 15వ తేదీలోపు పురపాలకాల్లో ఓడీఎఫ్‌ని పూర్తిస్థాయిలో నిర్వహించాల్సి ఉండగా కమిషనర్ మాత్రం అసంపూర్తిగా ఉండగానే ఓడీఎఫ్ ప్రకటన చేసిన విషయం విదితమే. గడువు పూర్తి కావటంతో ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఒక్కొక్కరికి 11 వార్డుల చొప్పున కేటాయించడమే కాకుండా ఇష్టారీతిగా పనులు సాగించేందుకు పర్యవేక్షకులుగా పురపాలక సిబ్బందిని వినియోగిస్తున్నారు. పుర ప్రజలకు కీలకమైన విభాగాల్లో సేవలందించాల్సిన ఇన్‌ఛార్జిలను సైతం మరుగుదొడ్ల నిర్మాణాల పర్యవేక్షణలో కేటాయించారు. పురపాలకంలో విధులు నిర్వర్తించాల్సిన సిబ్బందిలో సగంకంటే ఎక్కువ భాగం వార్డుల్లోనే సంచరిస్తున్నారు.

గండం గట్టెక్కేందుకు..

ప్రకటనను నిజం చేసుకుని గండం గట్టెక్కేందుకు అధికారులు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు. వాస్తవానికి మరుగుదొడ్ల లేని వారికి కొత్తగా నిర్మించుకునేందుకు మంజూరు పత్రాలు అందచేసి వారు నిర్మించుకునే స్థోమత ఉంటే సొంతగా నిర్మించుకునే అవకాశం కల్పించాలి. లబ్ధిదారుల భాగస్వామ్యంగా చెల్లించాల్సిన మొత్తం రూ.3వేలు కలిపి రూ.15 వేలతో నిర్మించుకునేందుకు పురమాయించాలి. ఇవేం చేయకుండానే గుత్తేదారులను అధికారులే కేటాయించి వారి ఆధ్వర్యంలో మరుగుదొడ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. నిర్మాణాలు పూర్తిచేయాల్సిన గడువు ముగిసే సరికి 10రోజులుగా హడావిడి చేస్తున్నారు. అందుకోసం ఇష్టారాజ్యంగా పురపాలక సిబ్బందిని కేటాయిస్తున్నారు. అసలు విధులకు వీడ్కోలు పలికి సిబ్బంది స్వామి సేవలో నిమగ్నమవుతున్నారు. దీంతో పురపాలకంలో సాధారణంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కుంటుబడుతుంది.

ఇసుక, ఇటుకలన్నీ పుర చెత్త ట్రాక్టర్లలోనే

వీధుల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్త ట్రాలీల్లో చాలా ప్రస్తుతం ఇసుక, ఇటుకలను తరలించేందుకు పురమాయిస్తున్నారు. మెడమీద కత్తి పెట్టినట్లుగా ఉండటంతో గుత్తేదారులు సైతం వారికి ఇష్టం లేకుండానే పనులను కొనసాగిస్తున్నారు.



పదకొండో నెంబర్ బజార్‌లో పునాది దశలోనే మరుగుదొడ్డి

పురపాలకం నుంచే వేతనాలు

10రోజులుగా ఆయా విభాగాలకు చెందిన పురపాలక సిబ్బంది మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించిన పనుల్లోనే నిమగ్నమవుతున్నారు. వారికి సంబంధించిన వేతనాలు మాత్రం పురపాలకం నుంచే చెల్లించాల్సి వస్తుండటం గమనార్హం. గుత్తేదారులకు అవసరమైన సామగ్రిని తరలిస్తూ, వారికి సంబంధం లేని పనుల్లో కొనసాగుతున్న వైనంపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతీరోజు సిబ్బంది పురపాలక కార్యాలయం విధుల్లో మస్టర్లు పడుతున్నారు. కాంట్రాక్టు కార్మికులు వారి విధుల్లోకి వెళ్తున్నట్లు మస్టర్లు పడుతున్నా సంబంధం లేని చోట కొనసాగిస్తున్నారు. ఈ విధానాలతో గుత్తేదారులకు సైతం లాభసాటిగా మారుతోంది. కొన్ని వార్డుల్లో నేరుగా కౌన్సిలర్ల బంధువులు, వారి అనుచర్లే గుత్తేదారులుగా వ్యవహరిస్తుండటంతో వారికి ఆదాయపరంగా వెసులుబాటు కలుగుతోందనడంలో సందేహం లేదు.

ఇంటికో ఉద్యోగం కల్పించాలి

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఇల్లెందు భూ నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం కల్పించాలని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు బానోతు రమేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. నాలుగో రోజుకు చేరుకున్న గిరిజన నిర్వాసితుల దీక్షా శిబిరాన్ని బుధవారం సందర్శించి వారికి మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం చట్టాలను కాలరాస్తూ అన్యాయంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పీసా, 1/70 యాక్టు చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. గ్రామ సభ తీర్మానాలు లేకుండానే అన్యాయంగా నివాస గృహాలను, భూములను తీసుకుని గిరిజనులను నిరాశ్రయులను చేసిందన్నారు. జీవో నెంబర్ 34 ప్రకారం ఇంటికో ఉద్యోగం, పక్కాగృహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు పలికిన వారిలో శ్రీనివాస్‌నాయక్, మోహన్, బాలాజీ, బీమా, నవీన్ తదితరులున్నారు.

ప్రసూతి సెలవులు 180 రోజులకు పెంపు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణిలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులను 180 రోజులకు పెంచేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెబొగకాసం నాయకులు ఎం.రాజిరెడ్డి తెలిపారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు కేవలం 90 రోజులు మాత్రమే ఉండగా, అధికారులకు మాత్రం 180 రోజులున్నాయన్నారు. దీనిపై యాజమాన్యంతో చర్చించడంతో పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే సింగరేణిలో జనవరి నుంచి అమలు కాకుండా ఉన్న ఎస్ఎల్‌పీ పదోన్నతులను కూడా అమలు చేసేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. మొత్తం 4800 పదోన్నతులను వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుందని, అందరికీ పదోన్నతులు అమలు చేస్తుందని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పంద కార్మికులకు చెల్లించే మెరుగైన వేతనాలను కూడా అమలు చేసేందుకు యాజమాన్యం సుముఖత వ్యక్తం చేసిందని తెలిపారు.

శిథిలావస్థలో సింగరేణి క్వార్టర్లు

ఏరియాలో నిరుపయోగంగా భవనాలు



పాతకాలనీలో ఖాళీగా ఉన్న సి-టైపు క్వార్టరు



ఫిల్టర్‌బెడ్ వెనుక శిథిలమవుతున్న ఎస్డీ టైపు క్వార్టర్లు



డీఎస్పీ కార్యాలయం వెనుక భాగంలో ఇలా...

ఇల్లెందు గ్రామీణం(సింగరేణి), న్యూస్‌టుడే

ఏరియాలోని సింగరేణి క్వార్టర్లు కేటాయింపులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కార్మికులకు కేటాయించినప్పటికీ చాలా వరకు క్వార్టర్లు ఖాళీగానే మిగిలిపోయాయి. దీంతో క్వార్టర్ల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరుగుతూ ఎందుకు పనికిరాకుండా మారుతున్నాయి. సింగరేణి కార్మికులు కాకుండా ఇతరులకు కేటాయించడంలో యాజమాన్యం మాత్రం అందుకు అంగీకరించడం లేదు. ఇటీవల అర్హత కలిగిన కార్మికులకు క్వార్టర్ల కేటాయింపుల కోసం యాజమాన్యం కౌన్సిలింగ్ నిర్వహించి కొన్ని క్వార్టర్లను కేటాయించింది. అయినప్పటికీ కార్మికవాడల్లో వివిధ రకాల క్వార్టర్లు వందల సంఖ్యలో ఖాళీగా ఉంటున్నాయి. ఏరియాలోని జేకే కాలనీలో ఎస్డీ, ఎ, బి, సి టైపు క్వార్టర్లు 110 ఖాళీగా ఉండగా... 24 పాత కాలనీలో 45 క్వార్టర్లు ఖాళీగా ఉండి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. యాజమాన్యం నిబంధనలను సడలించి ఇతర ఉద్యోగులకు తదితరులకు అద్దెకు ఇచ్చినట్లుయితే క్వార్టర్లు శిథిలావస్థకు చేరకుండా ఉండటంతోపాటు ఆర్థికంగా యాజమాన్యానికి కొంత డబ్బు చేకురుతోంది. ఆ దిశగా యాజమాన్యం చర్యలు చేపడితే బాగుంటుందని కార్మిక సంఘాలతోపాటు పలువురు కోరారు. క్వార్టర్లు తమ ఇళ్ల పక్కనే ఖాళీగా ఉండడంతో పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ఆయా క్వార్టర్ల పక్కనే నివాసం ఉండే కార్మిక కుటుంబాలు పేర్కొంటున్నాయి. యాజమాన్యం ఇప్పటికైనా పూర్తిస్థాయిలో క్వార్టర్ల కేటాయింపులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నివాస స్థలం ఇప్పించాలని వినతి

గోదావరిఖని, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన వృత్తి పనులు చేసుకుంటూ జీవించే తాము రహదారి విస్తరణతో నివాసాలు కోల్పోయినందున తిరిగి ఏర్పాటు చేసుకునేందుకు స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వలసజీవులు బుధవారం తెబొగకాసం నాయకులు మిర్యాల రాజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత 20 సంవత్సరాలుగా బస్టాండ్‌కాలనీ పాత డిగ్రీ కళాశాల ప్రహరీని ఆనుకుని కులవృత్తి చేసుకుంటు జీవిస్తున్నామని, ఇటీవల తమ గుడారాలను తొలగించడం వల్ల నిరాశ్రయులమయ్యామని విన్నవించారు. సింగరేణి అధికారులతో మాట్లాడి తమకు స్థలం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్ఎల్‌పీ పదోన్నతుల్లో ఆర్జీ-2 ఉద్యోగులకు అన్యాయం

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: జనవరి-2015 నుంచి ఆర్జీ-2లోని కార్మికులకు రావాల్సిన ఎస్ఎల్‌పీ పదోన్నతుల విషయంలో యాజమాన్యం కార్మికులకు అన్యాయం చేసిందని ఏఐటీయూసీ నాయకులు ఎల్.ప్రకాష్, బి.అన్నారావు, కె.రాజరత్నం అన్నారు. 2015లో అమలైన ఎస్ఎల్‌పీ పదోన్నతులను ఆర్జీ-1, 3 డివిజన్‌లలో అమలు చేస్తుండగా కేవలం ఆర్జీ-2 డివిజన్‌లో మాత్రం అమలు చేయకపోవడంతో కార్మికులకు ఆర్థికంగా అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయంలో బాధ్యత గల తెబొగకాసం నోరుమెదపడం లేదన్నారు.

సింగరేణి అటవీ శాఖ అధికారికి సన్మానం

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఆర్జీ-1 ప్రాంతానికి రాష్ట్ర ప్రభుత్వం హరితమిత్ర అవార్డుకు ఎంపిక చేయడాన్ని స్వాగతిస్తూ అందుకు కృషి చేసిన సింగరేణి అటవీశాఖ అధికారి డేవిడ్ అభిలాష్‌ను బుధవారం అధికారులు సన్మానించారు. గోదావరిఖని జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం విజయ్‌పాల్‌రెడ్డి శాలువాతో ఆయనను సత్కరించి అభినందించారు. హరితమిత్ర అవార్డుతో పర్యావరణానికి ఆర్జీ-1 ఇస్తున్న ప్రాధాన్యానికి గుర్తింపు దక్కిందన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థకు నిర్దేశించిన 10 లక్షల మొక్కలను నాటడంతో పాటు మరికొన్ని మొక్కలను జిల్లాలో పంపిణీ చేశామని జీఎం వెల్లడించారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అవార్డును అందుకోవడం గర్వంగా ఉందని, రానున్న కాలంలో మొక్కల పెంపకంపై మరింత దృష్టి సారించే బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో సింగరేణి పర్యావరణ అధికారి ఎ.శ్రీనివాస్, ఎస్ఓటు జీఎం త్యాగరాజు, పర్సనల్ డీజీఎం హన్మంతరావు, సీఎంవోఏఐ నాయకులు పి.శ్రీనివాస్, సురేశ్, కార్మిక నాయకులు పోశం, సత్తయ్య, అధికారులు సాంబయ్య, మనోహర్, నరేందర్ తదితరులు పాల్గన్నారు.

ఆర్మీ ఉచిత శిక్షణ తరగతుల ప్రారంభం నేడు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ఆర్జీ-2 డివిజన్‌లోని డాక్టర్ అబ్దుల్‌కలాం క్రీడామైదానంలో గురువారం నుంచి ఆర్మీ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీజీఎం ఎస్వీ రావు తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించే తరగతులను జీఎం విజయబాబు ప్రారంభిస్తారని, యాజమాన్యం ఉచితంగా కల్పిస్తున్న ఈ శిక్షణ సదుపాయాన్ని కాలనీతో పాటు సమీప గ్రామాల్లోని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్వచ్ఛ పక్వాడను విజయవంతం చేయాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలని జీఎం విజయ్‌పాల్‌రెడ్డి వెల్లడించారు. ఈమేరకు బుధవారం సాయంత్రం జీఎం కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 31 వరకు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భారీ ఎత్తున మొక్కలు నాటాలని, అందులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. దోమలు వ్యాప్తి చెందకుండా వీధులను శుభ్రం చేయాలని, దాని కోసం కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. భారీ ప్రదర్శనలు చేపట్టాలని, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. అధికారులు త్యాగరాజు, ప్రసాదరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి గుడికే ప్రమాదం సుమా!

నిర్వహణ మరచిన దేవాదాయ శాఖ


ప్రమాదపు అంచున హరనాథ్ బాబా ఆలయం

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం రామాలయానికి సమీపంలో దేవాదాయ శాఖకు చెందిన హరనాథ్‌బాబా ఆలయం ప్రమాదపు అంచున ఉండడానికి కారణం ఆ శాఖలో పేరుకుపోయిన నిర్లక్ష్యమే అన్నది భక్తుల వాదన. ఇక్కడి పరిస్థితిని పరిశీలిస్తే ఈ వాదనలో నిజం ఉందనక మానరు. హరనాథ్‌బాబా ఆలయానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఈ ఆలయానికి విలువైన భూములు ఉన్నాయి. వాటిపై కౌళ్ల రూపంలో ఆదాయం సమకూరుతుంది. కొన్ని భూములను ఇష్టానుసారంగా విక్రయించినప్పటికీ ఆ పైకాన్ని పూర్తిస్థాయిలో వసూలు చేయకుండా పెత్తనం వెలగబెడుతున్నారు. ఈ ఆలయాన్ని ఇక్కడ స్థాపించడంలో కీలక పాత్ర పోషించిన దాతల వారసులకు సెంటు భూమి కూడా ఇవ్వడం లేదు. ఇంత దర్జా అధికారులకే పరిమితమైంది గానీ ఆలయంలో మాత్రం పూర్వ శోభ కాలక్రమంగా కనుమరుగవుతోందన్నది ఆందోళన కలిగించే అంశం. ఈ ప్రాంగణంలోని కల్యాణ మండపం నిర్వహణ లోపంతో మూలన పడింది. చుట్టూ చెత్తా చెదారం పేరుకుపోయింది. పిచ్చి మొక్కలు పెరగడంతో తేళ్లు పాములు ఆలయం సమీపంలో తిరుగుతున్నాయి. మెట్లు పాకుడు పట్టి అపరిశుభ్రంగా మారాయి. పొదలను తొలగించే తీరిక అటు రామాలయం అధికారులకు ఇటు ఆలయ అధికారులకు లేకపోవడంతో ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత తాండవిస్తోంది. అన్నింటికీ మించి ఆలయానికి ప్రమాదం పొంచి ఉందన్న సంగతిని దేవాదాయ శాఖ పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఆలయం కింది వైపున రాళ్లను తొలగించడంతో కూలే ప్రమాదం ఉందన్నది భక్తుల భయం. వైదిక పెద్దలతో చర్చించి కింది వైపున నూతనంగా ఆలయాన్ని నిర్మించి దీనికి సమీపంలో ఉన్న స్థలంలో సత్రాలను నిర్మించగలిగితే ఆదాయం పెరగడం ఖాయం. ఇలా చేయడం వల్ల రామాలయానికి వచ్చే భక్తులు సమీపంలో ఉన్న శివాలయంతో పాటు హరినాథ్‌బాబాను దర్శించుకోవడం సులభతరమవుతుంది. రూ.100 కోట్ల అభివృద్ధి పనులు జరగనున్న నేపథ్యంలో భక్తులు మెచ్చుకునేలా దేవాదాయ శాఖ చర్యలు చేపట్టాల్సి ఉంది.


అపరిశుభ్రంగా మారిన దేవాలయం మెట్లు


ఆలయ రక్షణ గోడ దుస్థితి ఇలా..


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో శివశ్రీనివాస్

ఉద్యోగుల నుంచి రుణాలు రికవరీ చేయాలి

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఉద్యోగుల సంక్షేమ నిధి నుంచి గతంలో ఉద్యోగులు పొందిన రుణాల రికవరీపై దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి శివశ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన మందిరంలో బుధవారం సాయంత్రం ఉద్యోగుల సంక్షేమ నిధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి రుణాలు రికవరీ, వడ్డీ రికవరీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈడబ్బు వసూలుకు ఉద్యోగ సంఘాల నాయకులతోపాటు డ్రాయింగ్, పంపిణీ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జిల్లా పునర్విభజనలో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన జిల్లా ఉద్యోగుల నుంచి రావాల్సిన బకాయిలు వసూలు చేసే విధంగా డ్రాయింగ్ అధికారులు చూడాలన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన జాబితాను డీఈఓకు పంపాలన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో మరోసారి కమిటీ సమావేశం నిర్వహించాలని అప్పటి వరకు రికవరీల్లో పురోగతి సాధించాలన్నారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో రుణం కోసం దరఖాస్తు చేసుకున్న 97 మందికి ఉద్యోగుల సంక్షేమ నిధి నుంచి రుణం మంజూరు చేసేందుకు కమిటీ ఆమోదించింది. సమావేశంలో జడ్పీ ఉప సీఈఓ భారతి, జిల్లా ఖజానా డీడీ శ్రీనివాస్, సహాయ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, టీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నగర శాఖ కార్యదర్శి బిక్కు తదితరులు పాల్గొన్నారు.

ముర్రేడు వంతెనపై మళ్లీ నిలిచిన ట్రాఫిక్

గంటపాటు రాకపోకలు ఆగి ప్రయాణికుల ఇక్కట్లు


ముర్రేడు వంతెనపై బారులుదీరిన వాహనాలు

కొత్తగూడెం రామవరం, న్యూస్‌టుడే: ముర్రేడు వాగుపై మళ్లీ ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. శనివారం ముర్రేడు వంతెనపై లారీ నిలిచిన సంఘటనలో రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించగా, బుధవారం అదే సంఘటన పునరావృతమైంది. కొత్తగూడెం నుంచి పాల్వంచ వైపునకు వెళ్తున్న లారీ ముర్రేడు వాగు వంతెన ప్రారంభంలో నిలిచిపోవడంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు గంటపాటు వాహనాలు రెండు వైపులా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లారీ మరమ్మతులకు గురికావడంతో ఎంతకూ ముందుకు కదలకపోవడంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సరిగ్గా వంతెనపైనే ట్రాఫిక్ నిలవడంతో ముందుకు వెనుక వెళ్లే దారిలేక ఇబ్బంది పడ్డారు. శనివారం నాటి ఘటనలో సింగరేణి సంస్థకు సంబంధించిన అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకోగా, బుధవారం నాడు 108 వంతైంది. ట్రాఫిక్‌జామ్‌కు తోడు ఉక్కపోత జతకావడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. ఆరుగురు పోలీసులు ట్రాఫిక్ సరిచేయడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఒక్క టీకాతో ప్రాణాంతక వ్యాధులు దూరం: డీఎంహెచ్‌వో

కొత్తగూడెం రామవరం, న్యూస్‌టుడే: ఒకే టీకాతో తట్టు, రుబెల్లా వ్యాధులను నివారించడం సాధ్యపడుతుందని డీఎంఅండ్‌హెచ్‌వో దయానందస్వామి అన్నారు. బుధవారం కొత్తగూడెం బస్టాండ్ ఏరియాలో వైద్య, ఆరోగ్య శాఖా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ఈనెల 17 నుంచి సెప్టెంబరు 25వరకు టీకా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, 9నెలల నుంచి 15ఏళ్ల మధ్య వయసు చిన్నారులకు ఈ టీకాను వేయించడం ద్వారా ప్రాణాంతక సమస్యలను అధిగమించవచ్చన్నారు. న్యూమోనియా, డయేరియా, బుద్ధిమాంద్యం, అంధత్వం, వినికిడి సమస్యలు కూడా ఈ టీకాతో దూరమవుతాయన్నారు. కార్యక్రమానికి ముందు పాత బస్‌డిపో నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఉద్యోగులు, విద్యార్థులతో ప్రదర్శనను నిర్వహించారు. మానవహారాన్ని ఏర్పాటు చేశారు. డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ భాస్కర్‌నాయక్, ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డా. వినోద్, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


మానవహారంగా వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు, విద్యార్థులు

నేటి నుంచి బీ ఫార్మసీ చివరి దశ కౌన్సెలింగ్

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఈనెల17వ తేదీ నుంచి బీఫార్మసీ చివరి దశ కౌన్సెలింగ్ జరుగుతుందని ఖమ్మం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ యూ.వీరభద్రయ్య, కోఆర్డినేటర్ కె.సుదర్శన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. 17, 18 తేదీల్లో ఆప్షన్లు పెట్టుకోవచ్చు. మొదటిసారి పరిశీలన చేయించని వారు, ఇప్పుడు హాజరు కావచ్చు. సీటు పొంది కళాశాల నచ్చకపోతే మరోసారి ఆప్షన్లు పెట్టుకోవచ్చని వారు తెలిపారు.

ముఖ్యమైన తేదీలు

★ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పోస్టులకు: *9 సెప్టెంబరు*
★ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు: *12 సెప్టెంబరు*
★ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు, లెక్చరర్ పోస్టులు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులకు: *15 సెప్టెంబరు*

ప్రతిభ

1857 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు



టీఎస్‌పీఎస్సీ

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగులకు తీపి కబురు ప్రకటించింది. మొత్తం 2345 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ శాఖల్లో జనరల్ రిక్రూట్‌మెంట్ కింద ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఖాళీలు, అర్హతలు, ఎంపిక విధానం మొదలైన వివరాలు..

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

మొత్తం ఖాళీలు: 1857
వయసు: 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: రూ.16,400 - 49,870
అర్హత: ఇంటర్ లేదా తత్సమాన అర్హత అవసరం.

★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.
పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం.

చివరి తేదీ: 12 సెప్టెంబరు

సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు

★ మొత్తం ఖాళీలు: 205.
★ విభాగాల వారీగా ఖాళీలు: అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ - 41, పీడియాట్రిక్స్ - 27, అనెస్థీషియా - 39, ఆర్థోపెడిక్స్ - 5, ఈఎన్‌టీ - 20, డెర్మటాలజీ - 1, పాథాలజీ - 16, జనరల్ మెడిసిన్ - 34, సైకియాట్రిక్ - 3, రేడియాలజీ - 3, జనరల్ సర్జరీ - 16.
★ అర్హత: సంబంధిత విభాగంలో పీజీ డిగ్రీ/ డిప్లొమా లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: పేపర్ - 1లో జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
✪ పేపర్ - 2లో సెక్షన్ - ఎ, సెక్షన్ - బి అనే రెండు విభాగాలు ఉంటాయి. సెక్షన్ - ఎలో బేసిక్ యూజీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు (అందరికీ కామన్). సెక్షన్ - బిలో సంబంధిత పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
✪ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 90
★ అర్హత: అగ్రికల్చర్ ఒక సబ్జెక్టుగా ఏదైనా డిగ్రీ లేదా బోటనీ/ ఫారెస్ట్రీ/ హార్టికల్చర్/ జువాలజీ/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ జియాలజీలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి లేదా కెమికల్/ మెకానికల్/ సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 31 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.21,230 - 63,010
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.
పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమవుతాయి.

చివరి తేదీ: 12 సెప్టెంబరు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 67.
★ అర్హత: అగ్రికల్చర్/ బోటనీ/ కెమిస్ట్రీ/ కంప్యూటర్ అప్లికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్/ ఇంజినీరింగ్ (అగ్రికల్చర్/ కెమికల్/ సివిల్/ కంప్యూటర్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్)/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ ఫారెస్ట్రీ/ జియాలజీ/ హార్టికల్చర్/ మ్యాథమెటిక్స్/ ఫిజిక్స్/ స్టాటిస్టిక్స్/ వెటర్నరీ సైన్స్/ జువాలజీలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.31460 - 84970
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: జనరల్ ఇంగ్లిష్ పేపర్ (100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100), మ్యాథమెటిక్స్ పేపర్ (ఎస్ఎస్‌సీ/ హయ్యర్ స్కూల్ స్టాండర్డ్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100)లో సాధించిన మార్కులను క్వాలిఫయింగ్ మార్కులుగా పరిగణిస్తారు. 150 మార్కులకు జనరల్ స్టడీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. ఆప్షనల్ పేపర్‌లో (ఏదైనా ఒకటి మాత్రమే) 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మరో 50 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 12 సెప్టెంబరు

ట్యూటర్

★ మొత్తం ఖాళీలు: - 65
★ విభాగాల వారీగా ఖాళీలు: క్లినికల్ - 33. ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ నాన్ - క్లినికల్ - 32. ఎంబీబీఎస్/ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.(మెడికల్ స్పెషాలిటీ విభాగాల్లో)
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఉద్యోగాలు Jobs

★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
★ పేపర్ - 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ పేపర్ - 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 43.
★ అర్హత: ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,780
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఉంటాయి. సమయం: రెండున్నర గంటలు, మార్కులు 150.
పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు: 300. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 10.
★ అర్హత: బీడీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ స్టేట్ డెంటిస్ట్స్ రిజిస్ట్రేషన్ ట్రిబ్యునల్‌లో లేదా ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 150.
పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో డెంటల్ సర్జరీకి సంబంధించి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

లెక్చరర్లు

★ మొత్తం ఖాళీలు: 6
★ విభాగాలు: రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిస్ట్
★ అర్హత: ప్రథమశ్రేణి మార్కులతో ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎంఎస్సీ ఉత్తీర్ణతతోపాటు బార్క్ నుంచి హాస్పిటల్ ఫిజిక్స్, రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రెయినింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ. 37,100 - 91,450
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
పేపర్ – 2: పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా స్థాయిలో రేడియోలాజికల్ ఫిజిక్స్/ మెడికల్ ఫిజిక్స్‌కు సంబంధించి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

★ ఖాళీలు: 2
★ అర్హత: ఫిజియోథెరపీలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.17,890 - 53,950
★ ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా.
★ పరీక్షా విధానం: మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి.
పేపర్ 1: జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు 150. సమయం: రెండున్నర గంటలు.
పేపర్ 2: ఫిజియోథెరపీ (డిప్లొమా స్థాయిలో) నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు 150.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

చివరి తేదీ: 15 సెప్టెంబరు

వెబ్‌సైట్: www.tspsc.gov.in

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✪ ఖాళీలు: హిస్టరీ, ఆర్కియాలజీ - 1.
✪ తెలుగు, ఓరియంటల్ లాంగ్వేజెస్ - 1.
✪ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ - 1.
✪ సోషియాలజీ, సోషల్ వర్క్ - 1.
✪ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఛైర్ - 1.
✪ జువాలజీ - 1.
✪ బోటనీ, మైక్రోబయాలజీ - 1.
✪ మ్యాథమెటిక్స్ - 1.
✪ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ - డీన్ - 1.
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
✪ పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు 'రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, నాగార్జున నగర్ - 522510, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్' పేరిట ఎస్‌బీఐలో తీసిన రూ.2 వేల డీడీ జతచేసి పంపాలి.

చివరి తేదీ: 9 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.anu.ac.in**

బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ

శ్రీకాకుళంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✪ వివరాలు: ఆర్ట్స్: ప్రొఫెసర్ (లా - 1, సోషల్ వర్క్ - 1)
✪ సైన్స్: ప్రొఫెసర్ (బయోటెక్నాలజీ - 1, మ్యాథమెటిక్స్ - 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ - 1).
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
✪ రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2000

చివరి తేదీ: *29 ఆగస్టు*

✪ వెబ్‌సైట్: **www.brau.edu.in**

ఐఐఎం, విశాఖపట్నం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయనుంది.

✪ ఖాళీలు: అకౌంటెంట్ -1, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) -1, జూనియర్ ఇంజినీర్ -1, సీనియర్ లైబ్రరీ అండ్ ఇన్ఫో అసిస్టెంట్ - 1, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్ - 1.

వెబ్‌సైట్: **www.iimv.ac.in**

IBPS - RRBs Recruitment


No. of Questions: 80 **Maximum Marks: 80** **Time: 45 Mts.**

ప్రతిభ

IBPS Officers Prelims Model Paper - 2017

(నిన్నటి తరువాయి)

(37 – 39):




37. I. ✔ II. ✔
Both I and II follows.

38. I. ✔ II. ✕
Only I follows.

39. I. ✕ II. ✕
Neither I nor II follows.

40.



I. ✕ II. ✔
Only II follows.

41. 8×20 men = 8×32 women
$\Rightarrow$ 5 men = 8 women
5 men + 8 women = 16 women
$M_1D_1 = M_2D_2$
$\Rightarrow 8 \times 32 = 16 \times D_2$
$\Rightarrow D_2 = \frac{8 \times 32}{16} = 16$ days

42. Side of the square
$= \sqrt{1024} = 32$ cm.
$\therefore$ Length of rectangle
$= 2 \times 32 = 64$ cm.
Breadth of rectangle = 32 – 12 = 20 cm.
$\therefore$ Required ratio = 64 : 20 = 16 : 5

43. x + x + 2 + x + 4 + x + 6 + x + 8 = 220
$\Rightarrow 5x + 20 = 220 \Rightarrow x = 40$
Second lowest number of different set
$= 2 \times 40 - 37 = 43$
$\therefore$ Required sum
= 42 + 43 + 44 + 45 + 46 = 220

44. Bus fare = Rs. 420
Train fare $= 2 \times 420 \times \frac{3}{4}$ = Rs. 630
$\therefore$ Required total fare
= Rs. $(2 \times 420 + 4 \times 630)$ = Rs. (840 + 2520)
= Rs. 3360

45. Speed of tractor $= \frac{360}{12} = 30$ kmph
Speed of jeep $= 30 \times \frac{250}{100} = 75$ kmph
$\therefore$ Speed of car $= \frac{3}{5} \times 75 = 45$ kmph
$\therefore$ Average speed of car and jeep together
$= \left(\frac{75 + 45}{2}\right)$ kmph = 60 kmph

46. Gita's average earnings
$= \frac{140 + 200 + 420 + 400}{4} = \frac{1160}{4}$ = Rs. 290

47. Amount earned by Rahul and Naveen
= 180 + 260 + 340 + 160 = Rs. 940

48. Naveen's total earnings on Wednesday
= 420 + 120 = Rs. 540

49. Required difference = 240 – 200 = Rs. 40

50. Required ratio = 360 : 120 : 160
= 9 : 3 : 4

51. It is obvious from the table.

52. Percentage increase in 2006
$= \frac{-12.5 - 5.3}{5.3} \times 100 = 136$

53. Required difference
$= (14.5 - 6.6) \times 1000$ = Rs. 7900

54. Total monthly rent at Virar over the years
$= (1.1 + 2.1 + 1.8 + 3.6 + 5.5 + 7.8) \times 1000$
= Rs. 21900
$\therefore$ Required percentage $= \frac{9800}{21900} \times 100 = 45$

55. It is obvious from the table.

56. I. $5x^2 - 18x + 9 = 0$
$\Rightarrow 5x^2 - 15x - 3x + 9 = 0$
$\Rightarrow 5x(x - 3) - 3(x - 3) = 0$
$\Rightarrow (x - 3)(5x - 3) = 0$
$\therefore x = 3$ or $\frac{3}{5}$
II. $20y^2 - 13y + 2 = 0$
$\Rightarrow 20y^2 - 8y - 5y + 2 = 0$
$\Rightarrow 4y(5y - 2) - 1(5y - 2) = 0$
$\Rightarrow (4y - 1)(5y - 2) = 0$
$\therefore y = \frac{1}{4}$ or $\frac{2}{5}$
Clearly, x > y

57. I. $x^3 = 878 + 453 = 1331$
$\therefore x = \sqrt[3]{1331} = 11$
II. $y^2 = 82 + 39 = 121$
$\therefore y = \sqrt{121} = \pm 11$
$\therefore x \geq y$

58. I. $\frac{3}{\sqrt{x}} + \frac{4}{\sqrt{x}} = \sqrt{x}$
$\Rightarrow 3 + 4 = x \Rightarrow x = 7$
II. $y^3 - \frac{(7)^{7/2}}{\sqrt{y}} = 0$
$\Rightarrow y^{7/2} = 7^{7/2} \Rightarrow y = 7$
$\therefore x = y$

59. I. $9x - 4x = 54.55 + 15.45$
$\Rightarrow 5x = 70 \Rightarrow x = 14$
II. $\sqrt{y + 155} = 7 + 6 = 13$
$\Rightarrow y + 155 = 169$
$\Rightarrow y = 169 - 155 = 14$
$\therefore x = y$

60. I. $x^2 + 11x + 30 = 0$
$\Rightarrow x^2 + 6x + 5x + 30 = 0$
$\Rightarrow x(x + 6) + 5(x + 6) = 0$
$\Rightarrow (x + 5)(x + 6) = 0$
$\therefore x = -5$ or -6
II. $y^2 + 7y + 12 = 0$
$\Rightarrow y^2 + 4y + 3y + 12 = 0$
$\Rightarrow y(y + 4) + 3(y + 4) = 0$
$\Rightarrow (y + 3)(y + 4) = 0$
$\therefore y = -3$ or -4
Clearly, x < y

61. The pattern of the number series is :
$7 \times 2 + 6 = 20$; $20 \times 2 + 6 = 46$
$46 \times 2 + 6 = 98$
$98 \times 2 + 6 = 202$
$202 \times 2 + 6 = 404 + 6 = \boxed{410}$

Send your feedback to
pratibhadesk@eenadu.net

62. The pattern of the number series is :
$210 - 1^3 = 209$
$209 + 2^2 = 213$
$213 - 3^3 = 186$
$186 + 4^2 = 202$
$202 - 5^3 = 202 - 125 = \boxed{77}$

63. (5) The pattern of the number series is :
27 + 11 = 38
38 + 33 = 71
71 + 55 = 126
126 + 77 = 203
$203 + 99 = \boxed{302}$

64. (3) The pattern of the number series is :
$435 - 9 \times 9 = 354$
$354 - 9 \times 8 = 282$
$282 - 9 \times 7 = 219$
$219 - 9 \times 6 = 165$
$165 - 9 \times 5 = \boxed{120}$

65. (3) The pattern of the number series is :
$4 + 14^2 = 4 + 196 = 200$
$200 + 13^2 = 200 + 169 = 369$
$369 + 12^2 = 369 + 144 = 513$
$513 + 11^2 = 513 + 121 = 634$
$634 + 10^2 = 634 + 100 = \boxed{734}$

Calculations (66 – 70):
$\therefore$ 25% = 75
$\therefore 100\% = \frac{75}{25} \times 100 = 300$
$\therefore$ Total females = 300
Computer Science $\Rightarrow \frac{300 \times 35}{100} = 105$
Civil Engineering $\Rightarrow \frac{300 \times 5}{100} = 15$
Electrical Engineering $\Rightarrow \frac{300 \times 20}{100} = 60$
Mechanical Engineering $\Rightarrow \frac{300 \times 15}{100} = 45$
Bio-technology = 75
Total males = 700 – 300 = 400
Computer Science $\Rightarrow \frac{400 \times 30}{100} = 120$
Civil Engineering $\Rightarrow \frac{400 \times 15}{100} = 60$
Electrical Engineering $\Rightarrow \frac{400 \times 18}{100} = 72$
Mechanical Engineering $\Rightarrow \frac{400 \times 12}{100} = 48$
Bio-technology $= 400 \times \frac{25}{100} = 100$

66. Required percent $= \left(\frac{100 - 75}{75}\right) \times 100$
$= \frac{100}{3} = 33\frac{1}{3}\%$

67. Required ratio = 120 : 105 = 8 : 7

68. Required difference
= 72 + 48 – 60 – 45 = 15

69. Civil Engineering + Computer Science :
Total students = 105 + 15 + 120 + 60 = 300
Male students = 180
$\therefore$ Required percent $= \frac{180}{300} \times 100 = 60$

70. Required average
$= \frac{45 + 75 + 48 + 100}{2} = \frac{268}{2} = 134$

71. ? = 466 + 765 – 212 = 1019
$\therefore$ Required answer = 1020

72. $? = \frac{150 \times 150}{100} + 150$
= 225 + 150 = 375

73. $? = \frac{300 \times 750}{1000} - 1400$
= 2250 – 1400 = 850

74. ? = 51 – 34 + 21 = 38
$\therefore$ Required answer = 40

75. $? = \frac{900}{30} \times \frac{90}{300} \times \frac{600}{50} = 108$
$\therefore$ Required answer = 110

76. C.P. of wrist watch
$= \frac{100}{100 - \text{loss\%}} \times$ S.P.
= Rs. $\left(\frac{100}{75} \times 2400\right)$ = Rs. 3200
$\therefore$ Required S.P. of wrist watch =
Rs. $\left(\frac{125}{100} \times 3200\right)$
= Rs. 4000

77. Fifth number
$= 5 \times 56 - 4 \times 54 = 280 - 216 = 64$

78. Let the number be x.
$\therefore x + \frac{7}{9} \times \frac{35}{100} \times 900 = 325$
$\Rightarrow x + 245 = 325$
$\Rightarrow x = 325 - 245 = 80$

79. x + 4x + 5x + 60 = 360"
$\Rightarrow 10x = 300° \Rightarrow x = 30$
$\therefore$ Required difference = 5x – x
$= 4x = 4 \times 30 = 120"$

80. On dividing 1740 by 88,
the remainder = 68
$\therefore$ Required number = 68.

This model paper was prepared by subject experts of RACE Institute, Hyderabad

ఉద్యోగాలు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కింది పోస్టులను భర్తీ చేయనుంది.

- ఖాళీలు: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (న్యూక్లియర్) - 1.
- జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డీ) - 1.
- డిప్యూటీ జనరల్ మేనేజర్ (కంపెనీ సెక్రటరీ) - 1.
- పర్చేజ్ మేనేజర్ - 3.
- ఈసీఐఎల్ స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా కింది పోస్టులను కూడా భర్తీ చేయనుంది. వీటిని బధిరులకు కేటాయించారు.
- సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ - 1
- అకౌంట్స్ ఆఫీసర్ - 2. ✪ పర్సనల్ ఆఫీసర్ - 2.
- ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

✪ చివరి తేది: *31 ఆగస్టు*
వెబ్‌సైట్: **careers.ecil.co.in**

హాయ్! బుజ్జీ!!



మన జీవిత లక్ష్యం ఆనందం కాదు, దానికి తగిన అర్హత సంపాదించుకోవడం

– ఎమర్సన్


పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- push = తోయు
- మకరం = మొసలి

కొండల్లో ఇల్లంట.. ప్రపంచంలో మిన్నంట!!

ప్రపంచంలో ఎత్తయిన ఆకాశహర్మ్యం ఏదంటే... బుర్జ్‌ఖలీఫా అని ఠక్కున చెప్పేస్తాం. మరి ప్రపంచంలో ఎత్తయిన ఇల్లేదంటే చెప్పగలరా? తెలియకపోతే ఇది చదివేయాల్సిందే.



- మనం పది పదిహేను అంతస్తులుండే అపార్ట్‌మెంట్లు బోలెడు చూస్తుంటాం. అందులో చాలా కుటుంబాలు నివాసముంటాయి. అయితే ప్రపంచంలో ఒకే కుటుంబం ఉండే ఎత్తయిన ఇల్లొకటుంది. పేరు 'ఫాల్కన్ నెస్ట్'.
- అమెరికాలో ఆరిజోనా రాష్ట్రం ఉంది. అక్కడన్నీ చాలామటుకు రాతి కొండలు. అలాంటి చోటుందీ ఇల్లు.
- ఇది 6,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. 10 అంతస్తుల్లో ఉన్న దీని ఎత్తు 124 అడుగులు. అంటే ఓ పన్నెండు అంతస్తుల అపార్ట్‌మెంట్ అంత.
- ఈ ఇంట్లోంచి 360 డిగ్రీల్లో చుట్టూ ఏ ప్రదేశమైనా చక్కగా కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆరిజోనా పక్క రాష్ట్రం కాలిఫోర్నియాలోని పర్వతాలు సైతం ఈ ఇంట్లోకి కనిపిస్తాయి. దీని నిర్మాణమే ఆ రకంగా చేశారన్నమాట.
- ఇంత పెద్ద ఇంట్లో బోలెడన్ని పడకగదులు ఉంటాయనుకుంటారేమో. దీంట్లో ఉన్నది మూడు పడకగదులు, నాలుగు బాత్రూమ్‌లే. మిగిలిన స్థలమంతా బయటి ప్రకృతి అందాలు ఎక్కడికక్కడ కనిపించేలా అద్దాలతో ఉంటుంది.
- ఇల్లు వేసవిలో చల్లగా, శీతకాలంలో వెచ్చగా ఉండేలా ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంది.
- దీని యజమాని ఎంతో ఇష్టంతో 1994లో దీన్నిలా కట్టించుకున్నారు. ఆయన భార్య చనిపోవడంతో ఇప్పుడు దీన్ని అమ్మకానికి పెట్టారు. ప్రపంచంలోనే ఎత్తయిన ఇల్లు అమ్మకానికి వచ్చిందంటూ ఇది ఇప్పుడు మళ్లీ వార్తల్లోకొచ్చింది.



ధ్రువ ప్రాంత ఎలుగుబంట్లు వాసన చూడటంలో మహా దిట్టలు. ఆహారం మంచులో దాగి ఉన్నా ఇవి 20 మైళ్ల దూరం నుంచే పసిగట్టేస్తాయి.

కథ

నోటు పాట్లు!

ఒక అరటి పండ్లు అమ్మే వాడి డబ్బుల డబ్బాలోకొచ్చి పడిందో పది రూపాయల కాగితం. సరికొత్తగా మెరిసిపోతోంది. అయితే దాని ముఖంలో విచారం పరుచుకుని ఉంది.


ఆ డబ్బాలో ఉన్న మిగతా డబ్బు కాగితాలు, నాణేలు మొదట ఈ కొత్త నేస్తాన్ని కుతూహలంగా చూశాయి. దాని దిగులు ముఖం చూసి ఏమైందని అడిగాయి.

"ఊహ తెలిసినప్పటి నుంచి ఒక ఇనుప పెట్టెలో ఊపిరాడక బతికాను. ఈ రోజు ఒక షావుకారు దయవల్ల బయట పడ్డాను. ఊపిరి పీల్చుకోబోయానో లేదో అతగాడు నన్ను ఒక బిచ్చగత్తె జోలెలో పడేశాడు. ఆమె దగ్గరున్న సొట్టలు పడిన సత్తు గిన్నెలోకి చేరుకున్నాను. అలాంటి చోట బతకాలంటే ఎంత కంపరమనిపించిందో. ఇంతలో ఆమె అరటిపండ్లు కొనడంతో మళ్లీ ఈ పెట్టెలో కొచ్చి పడ్డాను. మళ్లీ చీకటి, ఇరుకు, ఉక్కపోత. ఇక్కడి నుంచి ఎవడి చెమట జేబులోకి వెళ్తానో, వాడు నన్ను ఎవరి పరం చేస్తాడో, ఇలా ఎన్ని చేతులు మారాలో తలుచుకుంటేనే గాబరాగా ఉంది". అని వాపోయింది.

పక్క డబ్బులన్నీ దీని వాలకానికి నిరుత్సాహ పడ్డాయి. ఇక దాని జోలికి పోకుండా తమలో తాము కబుర్లాడుకోసాగాయి.

ఇంతలో ఆ పెట్టెలోకి చేరింది మరో పది కాగితం. చాలా ముడతలు పడి మురికిగా, చిరగడానికి సిద్ధంగా ఉన్నట్లుంది. అయితే దాని ముఖం కళకళలాడుతోంది. వచ్చిన కాసేపటికే అన్ని రకాల డబ్బులనూ నవ్విస్తూ వాటికి మంచి నేస్తమయిపోయింది.

ఈ కొత్త కాగితాన్ని కూడా పలకరించింది. కానీ అది నవ్వలేదు సరికదా! మరింత ముఖం ముడుచుకుని 'మాసిపోయిన నీ వాలకం చూస్తుంటే కొన్నాళ్లకి నా గతీ ఇంతేనేమో అని ఏడుపొస్తోంది' అంది దీనంగా.



నవ్వుతూ వింటున్న పాత నోటుని నీకథేమిటంది ఆగలేక.

'మొదట నేనూ కొన్నాళ్లపాటు ఇనపపెట్టెలో ఊపిరాడకుండానే ఉన్నాను. కానీ ఒక కుటుంబానికి భద్రతనిస్తున్నాననే ఆనందంతో బాధ అనిపించలేదు. ఈ రోజు ఒక చెప్పులు కుట్టే మనిషి చేతికి వచ్చాను. ఇందాక అతను తన వణుకుతున్న చేతులతో చెమటతో తడిచిన జేబులోంచి నన్ను తీసి ఇచ్చి అరటిపళ్లు కొని ఒకటి ఆత్రంగా తిన్నాడు. అతని ఆకలి తీర్చగలిగాననే ఆనందం ఎంత బాగుందో! ఎందరివో చెమట, మురికి అంటుకుని ఇలా అయిపోయాను. నా జీవితంలో ఎన్ని మలుపులో! ఎన్ని మజిలీలో! అయినా నాకు అడుగడుగునా ఆనందమే'. చెబుతున్న పాత నోటును ఒక చెయ్యి పైకి లాగింది.

'మరెవరి అవసరమో తీర్చే అవకాశం మళ్లీ వచ్చింది నాకు. టాటా' అని వీడ్కోలు పలుకుతూ వెళ్లిపోయింది పాత నోటు.

అసలైన ఆనందం తారసపడిన పరిస్థితుల్ని బట్టి కాదు, అలవరుచుకున్న వైఖరిని బట్టి ఉంటుందని తెలుసుకుంది కొత్తనోటు. దాని మనసు కలత తీరి తేటపడింది.

- గుడిపూడి రాధికారాణి

నవ్వుల జల్లులు!



టీచర్: హోం వర్కులో ఎవరైనా తప్పులు చేస్తే వాళ్లకు రేపు గట్టిగా దెబ్బలు పడతాయి...

చింటు: అయితే రేపు మా అన్నను తప్పకుండా తీసుకొస్తాను టీచర్!

- జీవీయస్ ప్రియంవద, అరసవెల్లి



భార్య: ఏవండీ నేనీరోజు గారెలు చేశాను...

భర్త: అయితే పళ్ల డాక్టరు అపాయింట్‌మెంట్ తీసుకొస్తాను..

భార్య: ఎందుకండీ?

భర్త: అవి తిన్నా, తినకపోయినా తర్వాత ఏం జరుగుతుందో నాకు తెలుసు కాబట్టి!

- అంజి, చౌడేపల్లి

జతపరచండి!

ఇక్కడ సినిమా పేర్లు అసంపూర్ణంగా ఉన్నాయి. పక్కనున్న పదాల్లో ఏది సరిపోతుందో కనిపెట్టి జత చేయగలరా?


1. స్వామి	ఎ. కోరి
2. ఇట్లు	బి. వేడుక చూద్దాం
3. రారండోయ్	సి. రారా
4. నిన్ను	డి. శ్రావణి సుబ్రమణ్యం

చిలిపి ప్రశ్న

రాత్రిళ్లు కూడా పగలు కనిపించేదెప్పుడు?

- ఎ. వెంకట అమ్మిరాజు, పేరూరు

దారేది?



గబగబా అనండి

నత్త నడక
చిరుత ఉరక

- ఎం.సాయిచేతన్, హైదరాబాద్

ఎవరు నేను?

నేను ఏడక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలో 1,3,6,7 అక్షరాలు కలిపితే పద్యం అని అర్థం, 2,3,5,6– పాత్ర, 7,3,4– గుంపు అని అర్థం. ఇంతకీ నేనెవరిని?

1	2	3	4	5	6	7

ఏది భిన్నం?

a


b


c


జవాబులు: చిలిపి ప్రశ్న: కలగన్నప్పుడు! ఏది భిన్నం: C జతపరచండి: 1.సి 2.డి 3.బి 4.ఎ ఎవరు నేను: Problem

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శిరిడిసాయి అనుగ్రహం కోసం గురువారం పాటించాల్సిన నియమాలు...?, ఇంట్లో ఉండాల్సిన లక్ష్మీప్రదమైన వస్తువులు.., 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: జగన్మోహిని (నరసింహరాజు, ప్రభ).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': ఘుమ ఘుమలు 'చెనా బీట్‌రూట్ మసాలా', మీచేతి వంట 'పాలక్‌పకోడీ కర్రీ', 'బీరకాయ బొబ్బర్ల కర్రీ', జస్ట్ ఎ మినిట్ 'క్యాబేజ్ శాండ్‌విచ్' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: జీన్స్-2(రిపీట్), 05-30: ఆడాళ్లా మజాకా: (రావులపాలెం అతివల అల్లరి ఆటల సందడి), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ (ఖతర్నాక్ కామెడీ షో): వినోదాల విందు... 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డీజే రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం 04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డీజే
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
అమృతం (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ. 01:00, రా. 8:30)
ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ. 09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30).
విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగల దోపిడి (కృష్ణ, దీప), 10-00: మార్నింగ్ షో: అమ్మో బొమ్మ (రాజేంద్ర ప్రసాద్, ఉమా శంకరి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: వంశానికొక్కడు (బాలకృష్ణ, ఆమని), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: దేవా ది గ్రేట్ (సత్యరాజ్, భానుప్రియ), రాత్రి: 7-00: ఫస్ట్ షో: పంతాలు – పట్టింపులు (శోభన్‌బాబు, వాణిశ్రీ), 10-00: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఎగ్ ఇడ్లీ శాండ్విచ్ & హార్స్ గ్రామ్ సలాడ్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఓట్స్ అండ్ వెజిటబుల్ బాత్ & ఓట్స్ లీఫీ అండ్ ఆలూ పరోటా, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – చల్ల ఉండలు & స్వీట్ పనియారం, ఉ.11.00, రా.10.45: గోరుముద్దలు – మంగుళూర్ బన్స్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – పాలక్ రాజ్మా కర్రీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - సగ్గుబియ్యం పెరుగు వడలు & టమోట రోటి పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (గోవన్ – హిందు క్యూసైన్) - గోవన్ కోకోనట్ కేక్, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – పాలకాయలు, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - పొట్లకాయ వడ కర్రీ, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ఆచారి రోస్టెడ్ చికెన్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (స్కివర్స్ స్పెషల్) – ఆహతీర్ తుకా హష్య & బోహేమనియన్ డ్రెస్సింగ్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - శెనగల బిళ్ళల కర్రీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – తెరియాకి చికెన్, మ.2.30: చోటా షెఫ్ – ఎగ్ పకోడి, సా.5.15: స్నాక్స్ – టమాటో పాస్తా.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: కడుపులో సునామీ... **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ షిర్డీసాయిబాబా మందిరం సుజాతానగర్, విశాఖపట్నం, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, దేశ్‌ముఖ్, రంగారెడ్డి జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: కడుపులో సునామీ... 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 17-08-2017

ఉదయం: 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగళు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 అష్టలక్ష్మి అనుగ్రహం శ్రీ మాచిరాజు కిరణ్, 05-00 లైవ్ ఎస్.డి.సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + లక్ష్మీ నృసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 మహాలక్ష్మి వైభవం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం..

ఉదయం: 06-00 సాయిహారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 లక్ష్మీ వైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 05-30 సాయిగీతామృతం, 06-00 సద్గురుస్తోత్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

ఉదయం: 07-30 శుభమస్తు, 08-00 సినిమా: రెడీ, 11-00 కామెడీ ఖిలాడీలు (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడీ ఖిలాడీలు, 05-00 జైకృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: తులసి.

ఉదయం: 06-30 సిల్వర్‌స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 దిన ఫలం - రాశి ఫలాలు, 08-30 ఫన్‌టైమ్, 09-00 సినిమా: నమో వెంకటేశ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమపువ్వు, 02-30 బిగ్ బాస్ రిపీట్, 04-00 సినిమా: ఊహలు గుసగుసలాడే, **సాయంత్రం:** 05-30 ఒకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్ .

ఉదయం: 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ముగ్గురు మొనగాళ్ళు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: పందెంకోడి, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు,10-00 సినిమా: శౌర్యం.

సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినంగా ప్రకటించాలి: భాజపా


కలెక్టర్‌కి వినతిపత్రం అందిస్తున్న భాజపా నాయకులు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సెప్టెంబరు 17వ తేదీని టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించాలని భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఎందరో పోరాటల ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తే హైదరాబాద్ సంస్థానానికి మాత్రం స్వాతంత్ర్యం రాలేదని అన్నారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో బీజేపీ నాయకులు సీతారాంనాయక్, యేర్రాం రాజు, బెహరా, చిలుకూరు రమేష్, కొండి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతుడు శ్రీనివాసరావు

యజ్ఞనారాయణపురం (కల్లూరు), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో యజ్ఞనారాయణపురం గ్రామానికి చెందిన రైతు కట్టా శ్రీనివాసరావు(42) మృతి చెందాడు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన శ్రీనివాసరావు పొలంలో మోటారును ఆన్ చేసేందుకు బుధవారం సాయంత్రం సమయంలో వెళ్లాడు. మోటారులో నీరు పోసే ప్రయత్నం చేస్తూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. శ్రీనివాసరావును స్థానికులు వెంటనే కల్లూరు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఎస్సై పవన్‌కుమార్ కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టంకు పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య అరుణ, కుమారుడు సాయి ఉన్నారు. శ్రీనివాసరావు మృతితో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతూ తల్లడిల్లింది.



జొన్న సాగులో మెలకువలు



జొన్నను ఖరీఫ్ పంటగా ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో విత్తుకోవచ్చని మండల వ్యవసాయ విస్తరణాధికారిణి హారిక తెలిపారు. నల్లరేగడి, తేలికైన ఎర్ర నేలలు అనుకూలంగా ఉంటాయన్నారు.

రకాలు: సి.ఎస్.హెచ్-5, 6, 9, 13, పి.ఎస్.హెచ్-1, ఎ.ఎస్.హెచ్-1, పి.ఎస్.వి-1, సి.ఎస్.వి-15, నంద్యాల తెల్లజొన్న 3, ఎన్.జె-2169, ఎ.జె-140 తీపిజొన్న రకాలు విత్తవచ్చు. 105 నుంచి 115 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు 15-20 కింటాళ్ల దిగుబడి వస్తుంది. సి.ఎస్.హెచ్ 5, 6, 9, 13 రకాల్లో కంకి కండె ఆకారంలో ఉండి బూజు తెగులు తట్టుకొంటాయి. అంతర పంటలను వేసుకోవచ్చు. ఎత్తు ఎక్కువగా పెరుగుతుంది. చొప్ప ఎక్కువగా వస్తుంది. కాండం తొలుచు పురుగును కొంత వరకు నివారిస్తుంది. గింజ తెల్లగా ఉంటుంది.

విత్తనం: ఎకరాకు 4 కిలోలు సరిపోతుంది.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

విత్తే ఎడం : వరుసల మధ్య 45 సెం.మీ, వరుసలో మొక్కల మధ్య 12-15 సెం.మీ. దూరంలో విత్తాలి.

ఎరువులు: పశువుల ఎరువు ఎకరాకు 4 టన్నులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరాన్ని విత్తేటప్పుడు, పంట మోకాలు ఎత్తు పెరిగినప్పుడు.. 12 కిలోల నత్రజనిని పైపాటుగా వేయాలి.

నీటి యాజమాన్యం : తేలిక నేలల్లో వారానికి ఒకసారి, నల్లరేగడి భూముల్లో 15 రోజులకొకసారి తడి ఇవ్వాలి. పంట పూత, గింజ పాలు పోసుకునే సమయంలో నీరు తప్పకపెట్టాలి.

అంతర పంటలు : జొన్న, కందిలను 2:1 నిష్పత్తిలో వేసుకోవచ్చు.

అంతరకృషి : విత్తిన 30 రోజులకు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయడం వల్ల పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసేయాలి. విత్తిన తదుపరి కలుపు నివారణకు.. ఎకరాకు కిలో పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 3 రోజుల్లోపు పిచికారి చేయాలి. విత్తిన 15-20 రోజుల వ్యవధిలో 2, 4-డి ఎకరాకు 800 గ్రా., 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, సదాశివనగర్

భగ్గుమన్న విభేదాలు

అజ్ఞాత దళాల మధ్య ఆధిపత్య పోరుతో ఉద్రిక్తత

పాల్వంచ, న్యూస్‌టుడే

సీపీఐ ఎం.ఎల్.(న్యూడెమొక్రసీ) అజ్ఞాత దళాల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. గతంలో రెండు వర్గాల మధ్య ఉన్న విబేధాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కొంతకాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు తాజాగా రాయల భాస్కర్ హత్యతో బయటపడ్డాయి. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల సరిహద్దుల్లో న్యూడెమోక్రసీకి చెందిన పెద్ద చంద్రన్న వర్గం, రాయల వర్గానికి చెందిన దళాలు సంచరిస్తున్నాయి. ఈ రెండు వర్గాల మధ్య చాలాకాలంగా విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం వరకూ గార్ల, బయ్యారం, ఇల్లెందు, గుండాల, కొత్తగూడ, పాకాల ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులుండేవి. రెండేళ్లుగా వీరి మధ్య చెప్పుకోదగ్గ ఘటనలు ఏమీ జరగకపోవడంతో ఏజెన్సీ ప్రాంతంలో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చిందని అటవీ గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. దీనికి తోడు పోలీసుల నిర్బంధం కూడా పెరగడంతో ఈ రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు సద్దుమణిగిన వాతావరణం కనిపించింది. పాల్వంచ మండల పరిధిలోని నర్సంపేట గ్రామంలో బుధవారం జరిగిన సంఘటనతో ఈ రెండు వర్గాల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. చంద్రన్న వర్గానికి చెందిన మోరె రవి దళం నర్సంపేట గ్రామానికి చెందిన రాయల భాస్కర్‌ను బుధవారం హతమార్చింది. గతంలో భాస్కర్ చంద్రన్న వర్గంలో ఉన్నాడు. ఆ సమయంలో రవితో సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఇటీవల అయిదారు నెలల క్రితం నుంచి భాస్కర్ రాయల వర్గానికి సన్నిహితంగా ఉంటున్నారు. అయితే నర్సంపేటకు సమీపంలోనే ఉన్న రాజీవ్‌నగర్ గ్రామ గిరిజనుల విషయంలో ఈ రెండు వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ గ్రామం వాస్తవానికి బూర్గంపాడు మండల పరిధిలో ఉంది. మూడు రోజుల క్రితం భాస్కర్ ఆ గ్రామానికి వెళ్లి అక్కడ కొందరిని కొట్టి వచ్చినట్లు పోలీసుల సమాచారం ఉంది. ఆ నేపథ్యంలో రవి తన దళంతో వచ్చి భాస్కర్‌ను హతమార్చినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. గతంలోనూ రవి పాల్వంచ మండలంలో ఒక రైతును హతమార్చాడు. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కళ్లెం వెంకటరెడ్డిని భూవివాదం నేపథ్యంలో హతమార్చాడు. ఈ హత్య జరిగిన తరువాత దాదాపు రెండు, మూడేళ్లుగా ఎన్డీ దళాలు హత్యలకు పాల్పడలేదు. తాజా ఘటనతో రాయల, చంద్రన్న వర్గాల మధ్య ఆధిపత్య పోరు బహిర్గతమైందని, గిరిజన గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులున్నాయి. ఇవి ఎంత వరకూ దారి తీస్తాయోనని భయాందోళనలు చెందుతున్నారు. గతంలో ఈ రెండు వర్గాలు కత్తులు దూసుకున్న సమయంలో గిరిజన గ్రామాల ప్రజలు అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోయారు. తాజా పరిస్థితులు ఎటు దారితీస్తాయోనని ఏజెన్సీ గ్రామాలు దిగులు చెందుతున్నాయి. రాయల వర్గానికి చెందిన అగ్రనేత సుభాష్ చంద్రబోస్ అనారోగ్యంతో కొద్దికాలం క్రితం మరణించడం, ఇటీవల మధు అరెస్ట్ కావడం ఆ వర్గానికి పెద్దలోటు. ఆ లోటు పూడ్చుకునేందుకు బలపడే ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు చంద్రన్న వర్గం కొంత కాలంగా విస్తరిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జరిగిన భాస్కర్ హత్య పరిణామాలు ఎటుదారి తీస్తాయోనని ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఒంటికి వస్తే ఇంటికే

పలు ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక దుస్థితి
డ్రెస్సింగ్ రూం లేక బాలికల ఇబ్బంది
సమస్యను గుర్తిస్తేనే సత్ఫలితం



రఘునాథపాలెం మండలం వేపకుంట్ల ఉన్నత పాఠశాలలో 185 మంది విద్యార్థులున్నారు. బాలికలు 95, బాలురు 90మంది. ఉపాధ్యాయులు 08 మంది. వీరిలో ఉపాధ్యాయినులు ముగ్గురు. పాఠశాలలో రెండు మరుగుదొడ్లు, ఒక మూత్రశాల మాత్రమే ఉంది. ఇటీవల మూత్రశాల బ్లాక్ ఒకటి మంజూరైంది. నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. విద్యార్థులకు సంఖ్యకు సరిపడా లేకపోవడంతో సమస్య తలెత్తుతోంది.

తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి ఉన్నత పాఠశాలలో 476 మంది విద్యార్థులున్నారు. వారిలో 198 మంది బాలికలు, 278 మంది బాలురు. 20 మంది ఉపాధ్యాయుల్లో 12 మంది ఉపాధ్యాయినులే. వీరికి కావాల్సిన మరుగుదొడ్డి, మూత్రశాలల యూనిట్లు ఆరు. ఒక మరుగుదొడ్డి, ఒక మూత్రశాలనే ఉంది. తాజాగా రెండు యూనిట్లు మంజూరయ్యాయి(ఒక్కో యూనిట్‌కు నాలుగు మరుగుదొడ్లు, నాలుగు మూత్రశాలలు). ప్రస్తుతం మరుగుదొడ్డి సౌకర్యం సరిపడా లేకపోవడంతో విద్యార్థినులు అవసరాలకు ఇంటి దారి పట్టాల్సి వస్తోంది.



ఈనాడు ఈటీవీ తెలంగాణ కథనం

ఈనాడు, ఖమ్మం

ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం సమస్యతో సహజీవనంగా మారింది. చదువును 'కొన'లేనివారంతా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తారనడంలో సందేహం లేదు. పేద, మధ్య తరగతి విద్యార్థులు అధికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. చదువు వంటపట్టాలన్న, శ్రద్ధగా చెప్పేది వినాలన్నా సమస్యలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో లేనపుడు ఆ బాధ వర్ణనాతీతం. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులను భావిభారత పౌరులు ఎదుర్కొంటుండటం దురదృష్టకరం. ప్రభుత్వం విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నా స్వచ్ఛ భారత్ పేరున పలు నిర్మాణ పనులు చేపడుతున్నా విద్యార్థుల అవస్థలు తొలగటం లేదు.

అశ్వారావుపేట ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్డి వసతి ఉంది. నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. అదే ఆవరణలో ఉన్న బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో చాలినన్ని మరుగుదొడ్లు లేవు.

నారాయణపురం, గుమ్మడివల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లులేవు. నారంవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు బయటకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తోంది.

దమ్మపేట జడ్పీ ఉన్నత పాఠశాలలోని మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేదు.

ములకలపల్లి మండలం ఎన్.జగన్నాథపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చాలినన్ని మరుగుదొడ్లు లేవు. ఉన్న వాటికి నీటి సౌకర్యం లేదు.

భద్రాచలం ఎయిడెడ్ పాఠశాలలు మూడు ఉన్నాయి. మూడింటికి విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లులేవు. దుమ్ముగూడెం మండలం ఎన్.లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీటి సౌకర్యం లేదు. ఇదే మండలంలోని అచ్యుతాపురం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు ఉన్నా నీటి సౌకర్యంలేదు.

చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. ఇల్లెందు పట్టణంలోని మెయిన్ రోడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు.

టేకులపల్లి, కామేపల్లి మండలం ముచ్చర్ల, కొమ్మినేపల్లి ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీటి వసతిలేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

టేకులపల్లి మండలంలోని సుమారు 17 పాఠశాలలకు నీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బోడు ఉన్నత పాఠశాల, కొక్కిరాయి, రామచంద్రునిపేట తదితర ప్రాథమికోన్నత పాఠశాలల్లో నీటి వసతి లేదు.

ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల ప్రాథమిక పాఠశాలలో 128 మంది విద్యార్థులు ఉన్నారు. బాలికలు 75, బాలురు 53 మంది ఉన్నారు. ఉపాధ్యాయులు నలుగురు ఉన్నారు. ఇద్దరు మహిళా ఉపాధ్యాయులు. పాఠశాల మొత్తానికి అంగవైకల్యం ఉన్న వారికి ఒకటి, బాలికలకు మరో మరుగుదొడ్డి ఉంది. మిగతా వారందరు ఇబ్బందులు పడాల్సిందే. వెలుగుమట్ల ఉన్నత పాఠశాలలో 102 మంది విద్యార్థులు ఉన్నారు. 44 మంది బాలురు, 58 మంది బాలికలు ఉన్నారు. ఉపాధ్యాయులు ఏడుగురు కాగా వారిలో ఇద్దరు మహిళలు. బాలురకు ఒక మరుగుదొడ్డి, మూత్రశాల ఉంది. బాలికలకు ఇదే పరిస్థితి. ఉపాధ్యాయులకు ఒక మరుగుదొడ్డి, ఒక మూత్రశాల ఉంది. విద్యార్థులంతా ఒకేసారి వదలడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మధిర మండలం చిలుకూరు ప్రాథమికోన్నత పాఠశాలు, దెందుకూరు ప్రాథమిక, జాలిమూడి ప్రాథమికోన్నత, మాటూరు ప్రాథమికోన్నత , ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు విద్యార్థులకు సరిపడాలేవు. ఎర్రుపాలెం మండలం పగిళ్లపాడు, పెద్దగోపారం, జములాపురం, లక్ష్మీనగర్ పాఠశాలలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీటి సౌకర్యం లేదు. మూత్రశాలలు లేవు. ఉన్నవి సరిపోవడంలేదు. సత్తుపల్లి మండల కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ విద్యార్థులకు సరిపడాలేవు. తల్లాడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు బాలికలకే అంతంత మాత్రంగా సరిపోతున్నాయి. బాలురు ప్రధాన రహదారిని ఉపయోగిస్తున్నారు. వేంసూరు మండలం చౌడవరం ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపడాలేవు. నీటి సౌకర్యం లేదు. వైరా ఉన్నత పాఠశాలలో ఒకే మరుగుదొడ్డి ఉండటం కారణంగా విద్యార్థులకు తీవ్ర అవస్థలు ఏర్పడుతున్నాయి.

డ్రెస్సింగ్ రూం జాడ కరవు..

విద్యార్థినులు బాహ్య ప్రపంచంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు తోడు కొన్ని ఆరోగ్య సమస్యలను అధిగమించాల్సి వస్తోంది. ముఖ్యంగా ఎనిమిదో, తొమ్మిదో, పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు డ్రెస్సింగ్ రూం సమస్యగా మారింది. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు తదితర పాఠశాలలో ఒక గదిని ఇందుకోసం కేటాయించారు. ఇలా రెండు జిల్లాల్లో గదులను కేటాయించిన పాఠశాలలు కొన్నే ఉన్నాయి. రుతుచక్రం సమయంలో బాలికలు ఇతరులకు చెప్పుకోలేక, తోటి విద్యార్థుల ముందు చులకన కాలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇదే సందర్భంలో బోధిస్తున్న పాఠాలు వారి మదిని చేరడంలేదు. కొన్నిసార్లు పాఠశాలలకు తాత్కాలికంగా మానేయడం, లేనిపక్షంలో పూర్తిగా మానేయడం చేస్తున్నారంటే అతిశయోక్తికాదు. వాస్తవానికి ప్రతి పాఠశాల ఆవరణలో ఒక గదిని బాలికల డ్రెసింగ్ కోసం కేటాయించాల్సిన అవసరం ఉంది. ఇది బాధ్యత కూడా.

కొండెక్కిన ప్యాడ్ల పంపిణీ

బాలికలకు గతంలో ప్యాడ్స్ పాఠశాలలో అందించేవారు. ఇందుకు ఓ నిర్వాహకురాలుండేవారు. ఇపుడు ఏ ఉన్నత పాఠశాలలోనూ ప్యాడ్స్ విద్యార్థులకు ఇవ్వడం లేదు. 2013-14 విద్యా సంవత్సరం తర్వాత ఈ ప్రక్రియ నిలిచిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు పాఠశాలకు వచ్చిన సమయంలో ప్యాడ్స్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు కూడా అంగీకరిస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉంది. పేద, మధ్యతరగతి బాలికలు రుతుక్రమంలో దుస్తులు(బట్టలు) వాడుతున్నారని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఫలితంగా అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, బాలికల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ప్యాడ్స్‌ను ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులో ఉంచితేనే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాతకాలం నాటిది..: స్వాతి, గ్రామం జల్లేపల్లి, మండలం తిరుమలాయపాలెం



మరుగుదొడ్డి పాతకాలం నాటిది. దీనికితోడు విద్యార్థినులకు సరిపడా లేవు. దాంతో ఇబ్బందులు పడుతున్నాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలి. అపుడు సమస్యలు లేకుండా ఉంటాయి.

ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది..: ప్రీతికాంక్ష, జల్లేపల్లి



మరుగుదొడ్డి, మూత్రశాల సంఖ్య తక్కువగా ఉండటంతో విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు చొరవ చూపి మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలి. అపుడే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అందరు విద్యార్థులు ఒకేసారి రావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

మరుగుదొడ్లు లేని పాఠశాలలు గుర్తింపు

విజయలక్ష్మీబాయి, ఖమ్మం డీఈవో

జిల్లాలో మరుగుదొడ్లు లేని పాఠశాలలు గుర్తించారు. 545 పాఠశాలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా కొత్తగా మరుగుదొడ్లు నిర్మించనున్నాం. వచ్చే నెలాఖరు నాటికి ఇవి పూర్తయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇప్పటికి వినియోగంలోలేని 1,100 మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోనికి తీసుకువచ్చాం. బాలికలకు సంబంధించిన ప్యాడ్స్ 2013 వరకు రాజీవ్ విద్యామిషన్ ద్వారా సరఫరా చేయడం జరిగింది. ఇపుడు మాత్రం పంపిణీ చేయడంలేదు.

ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మోడల్ సర్వే

ఓటర్ల సమగ్ర సర్వేతో ఓటర్ల జాబితాల ప్రక్షాళన

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ఓటర్ల సమగ్ర సర్వే(ఐఆర్ఈఆర్)కు జిల్లాలోని ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలను మోడల్‌గా తీసుకుని సర్వే జరుపుతున్నట్లు ఖమ్మం ఎన్నికల ఉపతహసీల్దారు కేవీ పవన్‌కుమార్ తెలిపారు. రఘునాథపాలెం మండలంలో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన తహసీల్దారు డి.తిరుమలాచారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బూత్ స్థాయి అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారాలను వివరించారు. అనంతరం ఆయన తహసీల్దారుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఓటర్ల జాబితాల సర్వేకు ప్రతి జిల్లాకు రెండు నియోజకవర్గాలను ఎంపిక చేశారని, జిల్లాలోని ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలను ఈ విధంగా సర్వేకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో మొత్తం 260 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో ఖమ్మం నగర పరిధిలో 224, రఘునాథపాలెం మండల పరిధిలో 36 పోలింగు కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ కేంద్రాల పరిధిలో మొత్తం 2,66,840 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రస్తుతం నగరంలోని కొన్ని పోలింగు కేంద్రాల పరిధిలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో విభజన చేయడం జరిగిందని, దీనివల్ల కొత్తగా మరో 13పోలింగు కేంద్రాలు ఏర్పాటవుతున్నాయన్నారు. ఓటర్ల సర్వే ప్రారంభమయ్యిందని, సర్వేకు బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక ట్యాబ్‌లను అందజేశారన్నారు. ట్యాబ్‌లలో ఓటర్ల నమోదుపై బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారని, సర్వేను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు.

ఓటర్ల పేర్లలో, చిరునామాలో తప్పుల సవరణ, స్థానికంగా ఉండని ఓటర్ల తొలగింపు, కొత్త ఓటర్ల చేర్పు, ఓటరు ఫొటో, ఆధార్ అనుసంధానం వంటి అన్ని పనులు ఏకకాలంలో పూర్తవుతాయన్నారు. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ఓటర్ల నివాసం జియోట్యాగింగ్ అవుతుందని, ఆగస్టు 20వ తేదీ లోపు సర్వేను పూర్తి చేయాల్సి ఉందన్నారు. కొత్త ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని అన్నారు. జీపీఎస్ యాక్టివేషన్ తొలిసారిగా జరుగుతోందన్నారు. గతంలో ఒకే ఇంట్లో నివసించే ఓటర్లు రెండు పోలింగు కేంద్రాలలో ఉన్న సందర్భాలు ఉన్నాయని, ప్రస్తుతం నిర్దిష్ట హద్దుల మధ్య ఉన్న నివాసాలలోని ఓటర్లందరూ ఒకే పోలింగు కేంద్రం పరిధిలోకి వస్తారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే విజయవంతం అయితే రాష్ట్రస్థాయిలో అమలు చేసే అవకాశం ఉందన్నారు. మారుమూల గ్రామాలలో సిగ్నల్ సమస్య, కొన్ని ప్రాంతాలలో ఓటర్ల అప్‌లోడ్ ఆలస్యం అవుతుండటం, కొన్ని ట్యాబ్‌లు పనిచేయకపోవడం వంటి సమస్యలు గుర్తించామన్నారు. వీటిని పరిష్కరించి సర్వే సక్రమంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు తిరుమలాచారి, డీటీ పవన్‌కుమార్‌లు వివరించారు.



బీఎల్‌వోలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు తిరుమలాచారి, డీటీ పవన్‌కుమార్